ఒక గుడి కడితే
వెయ్యి మంది బిక్షగాళ్ళు
తయారవుతారు అదే.. ఒక బడి కడితే
వెయ్యి మంది మేధావులు
తయారవుతారు
- డా. బాబాసాహెబ్ అంబేద్కర్

Truth of News
RNI NO : APTEL/25/A0239
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 296 | బుధవారం 12 మే 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50
Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# నీట్ పరీక్ష రద్దు

- రాజస్తాన్‌లో ప్రశ్నాపత్రం లీక్
- కేసు నమోదు చేసిన సీబీఐ
- మహారాష్ట్రలో ఒకరి అరెస్ట్
- ఈనెల 3న దేశవ్యాప్తంగా జరిగిన పరీక్ష
- 22 లక్షల మంది విద్యార్థులకు నిరాశ
- నిరుత్సాహంలో తల్లిదండ్రులు
- మోడీ సర్కార్ వైఫల్యాలకు నిదర్శనం
- మళ్లీ పరీక్ష నిర్వహిస్తాం.. : ఎన్‌టీఏ డీజీ అభిషేక్‌సింగ్

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం:





దేశంలోనే ఎంతో ప్రతిష్టాత్మక ప్రవేశపరీక్ష నీట్ యూజీ-2026 రద్దయ్యింది. ఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం రాజస్తాన్‌లో లీక్ అయ్యిందనే ఆరోపణలతో ఈ ప్రవేశ పరీక్ష?ను రద్దు చేస్తున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. ఈ నెల 3వ తేదీ జరిగిన నీట్ పరీక్షను దేశవ్యాప్తంగా 22 లక్షలమంది రాసారు. పరీక్షల్ని సమర్ధవంతంగా నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రశ్నాపత్రం లీకైన విషయం నిర్ధారణ కాగానే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ కేంద్రాన్ని సంప్రదించారు. కేంద్రం వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించింది. ఆ వెంటనే ప్రశ్నాపత్రాలు ముద్రించిన నాసిక్ ప్రింటింగ్ ప్రెస్ నుంచి ఒకర్ని ఆరెస్టు చేసినట్టు తెలిసింది. లీకేజీతో నష్టపోయిన ఆశావాహులకు న్యాయం చేయడానికి త్వరలో మళ్లీ పరీక్ష? నిర్వహిస్తామనీ, దీనికి సంబంధించిన తేదీని త్వరలో ప్రకటిస్తామని ఎన్‌టీఏ పేర్కొంది. ఈ ప్రక్రియ పదిరోజుల్లో ప్రారంబ?మవుతుందని తెలిపింది. మళ్లీ పరీక్ష రాయబోయే విద్యార్థులు ఎవరూ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. పాత రిజిస్ట్రేషన్ డేటానే పరిగణలోకి తీసుకుంటామని వెల్లడించింది. గతంలో ఎంచుకున్న పరీక్ష?? కేంద్రాలే ఉంటాయనీ, ఎలాంటి అదనపు రుసుము ఉండబోదని తెలిపింది. నీట్ యూజీ పరీక్షను దేశవ్యాప్తంగా ఈ నెల 3న నిర్వహించారు.

- మిగతా 2లో..

## 15 నుంచి ప్రధాని మోదీ
# విదేశీ పర్యటనలు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం



అంతర్జాతీయ వేదికపై భారత దౌత్య పటిమను చాటేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరు రోజుల పాటు ఐదు కీలక దేశాల్లో పర్యటించనున్నారు. మే 15వ తేదీన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)తో ప్రారంభమయ్యే ఈ పర్యటన నెదర్లాండ్స్, స్వీడన్, నార్వేల మీదుగా సాగి మే 20వ తేదీన ఇటలీతో ముగియనుంది. మరి ఈ ఐదు దేశాల పర్యటనలో భాగంగా మోదీ ఎలాంటి నిర్ణయాలు తీసుకోబోతున్నారు, మే 15వ తేదీన ప్రధాని మోదీ తొలుత యూఏఈ అధ్యక్షుడిని కలుస్తారు. ఇంధన సహకారం, వాణిజ్యం, 4.5 మిలియన్ల భారతీయ సమాజ సంక్షేమంపై చర్చించనున్నారు. భారత్‌కు 3వ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉన్న యూఏఈతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశ్యం.అక్కడి నుంచి మే 15వ తేదీన

- మిగతా 2లో..



# నేడు బలపరీక్ష

- అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలతో సీఎం విజయ్ భేటీ
- మద్దతు ఇస్తామని ఇప్పటికే ప్రకటించిన షణ్ముగం
- బలపరీక్ష నేపథ్యంలో షణ్ముగం, విజయ్ భేటీకి ప్రాధాన్యం

చెన్నై- సూర్య వాస్తవం:

తమిళనాడులో నూత నంగా ఏర్పడ్డ టీవీకే ప్రభుత్వం బలనిరూపణ చేసుకో వాల్సిన నేపథ్యంలో అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలతో సీఎం విజయ్ భేటీ

- మిగతా 2లో..

## అస్సాం సీఎంగా రెండోసారి
# హిమంత బిశ్వ శర్మ..

- ఘనంగా ప్రమాణ స్వీకారం
- హాజరైన ప్రధాని మోదీ, అమిత్ షా, కేంద్ర మంత్రులు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్
- శర్మతో పాటు మరో ఐదుగురు మంత్రులుగా ప్రమాణ స్వీకారం
- వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ-ఎన్డీయే కూటమి

అస్సాం- సూర్య వాస్తవం



అస్సాంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి వరుసగా మూడో సారి అధికారాన్ని నిలబెట్టుకుంది. ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ వరుసగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేశారు. గువాహటిలోని ఖానాపారాలో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య.. హిమంత బిశ్వ శర్మ చేత పదవీ ప్రమాణ

- మిగతా 2లో..

## ప్రధాని 'అమృత్ కాల్'.. దేశానికి
# 'విష్ కాల్'గా మారింది
### - మోడీ ప్రభుత్వంపై రాహుల్ గాంధీ ఫైర్

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం



నీట్ (యుజి) 2026 రద్దు చేస్తున్నట్లు జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) మంగళవారం ప్రకటించింది. నీట్ రద్దుపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మోడీ ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. ప్రధాని మోడీ అమృత్‌కాల్ 'విష్ కాల్'గా మారిందని తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. కాగా, నీట్ 2026 పరీక్ష రద్దయింది. దీంతో 22 లక్షలకు పైగా విద్యార్థుల కఠోర శ్రమ, త్యాగాలు, కలలు ఈ అవినీతి బిజెపి ప్రభుత్వ పాలన చేత

- మిగతా 2లో..

## కేరళం కాంగ్రెస్ నేతలు
# రాహుల్‌తో భేటీ
### - ముఖ్యమంత్రి పోస్టుపై చర్చలు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

కేరళం అసెంబ్లీ ఎన్నికల్లో యుడిఎఫ్ అత్యధిక మెజార్టీతో గెలుపొందింది. అసెంబ్లీ ఫలితాలు వెలువడి వారం రోజులు దాటినా ఇంకా కేరళ సిఎం ఎవరనేది కాంగ్రెస్ అధిష్టానం ఖరారు చేయలేదు. ఇంకా తర్జనభర్జనలు కొనసాగుతున్నాయి. ఇటీవల కాంగ్రెస్ అధ్యక్షుడు

- మిగతా 2లో..

# కలెక్టర్లదే బాధ్యత

- ధాన్యం, మక్కలు కొనుగోళ్లు చేపట్టాలి
- నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు
- గోడౌన్లు, తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలి
- లారీలు అందుబాటులో లేకుంటే కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు
- రైతులను ఇబ్బంది పెట్టొద్దు
- రోజువారీ రిపోర్టులు సీఎస్‌కు ఇవ్వండి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం ఏ రేవంత్‌రెడ్డి



హైదరాబాద్- సూర్య వాస్తవం

రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియ బాధ్యత పూర్తిగా జిల్లా కలెక్టర్లదేనని సీఎం ఏ రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. దానికోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలనీ, విధి నిర్వహణలో అలసత్వం ప్రదరిస్తే కఠిన చర్యలు తప్పవనీ హెచ్చరించారు. మంగళవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

- మిగతా 3లో..



# రాష్ట్రంలో విభిన్న వాతావరణం

అమరావతి - సూర్య వాస్తవం

రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. కొన్నిప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు, మరికొన్ని ప్రాంతాల్లో ఎండ ప్రభావం చూపుతుందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎండీ ప్రఖర్ జైన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం అదే ప్రాంతంలో కేంద్రీకృతమై ఉందని, ఇది రాగల 48 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందన్నారు. అల్పపీడనం నుండి ఉత్తర తమిళనాడు, రాయలసీమ, కర్ణాటక మీదుగా మరాఠ్వాడా వరకు ద్రోణి విస్తరించి ఉందని తెలిపారు.

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## 15 నుంచి ప్రధాని మోదీ
# విదేశీ పర్యటనలు

(మొదటిపేజీ తరువాయి)

నెదర్లాండ్స్ వెళ్తారు. 17వ తేదీ వరకు అక్కడే పర్యటిస్తారు. రక్షణ, గ్రీన్ హైడ్రోజన్, సెమీకండక్టర్లు, 'నీటి నిర్వహణ'పై వ్యూహాత్మక ఒప్పందాలను సమీక్షించనున్నారు. నెదర్లాండ్స్ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరుణంలో ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.మే 17వ తేదీ రోజు స్వీడన్ వెళ్తారు. 18 తేదీల్లో స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్‌లో ప్రధాని పర్యటిస్తారు. గ్రీన్ ట్రాన్సిషన్, ఏఐ, అంతరిక్షం, రక్షణ రంగాల్లో పెట్టుబడులే లక్ష్యంగా చర్చలు సాగతాయియి. అలాగే ఐరోపా పారిశ్రామిక వేత్తల రౌండ్ టేబుల్ సమావేశంలో ఈయూ కమిషన్ ప్రెసిడెంట్‌తో కలిసి ఆయన ప్రసంగించనున్నారు.

**43 ఏళ్ల తర్వాత నార్వే పర్యటన..!**

ఈ పర్యటనలో అత్యంత విశేషంగా నార్వే పర్యటన నిలవబోతోంది. 43 ఏళ్ల తర్వాత భారత ప్రధాని నార్వే వెళ్లడం ఇదే తొలిసారి. మే 18వ తేదీన ఆయన నార్వేకు చేరుకుని 19వ తేదీన నార్వే రాజుతో పాటు ప్రధానితో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. అదే సమయంలో ఓస్లోలో జరిగే '3వ భారత్-నార్డిక్ సమ్మిట్'లో మోదీ పాల్గొంటారు. డెన్మార్క్, ఫిన్లాండ్, ఐస్లాండ్ ప్రధానులు కూడా ఈ సదస్సుకు రానున్నారు.పర్యటన చివరి రోజైన మే 20వ తేదీన ప్రధాని మోదీ ఇటలీ చేరుకుంటారు. ప్రధాని జార్జియా మెలోనితో కలిసి 'జాయింట్ స్ట్రాటజిక్ యాక్షన్ ప్లాన్ 2025-2029' అమలుపై సమీక్ష నిర్వహిస్తారు. రక్షణ, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో ఇటలీతో భారత్ సంబంధాలను ఈ పర్యటన మరింత పటిష్టం చేయ నుంది. మొత్తానికి ఐరోపా దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల నేప థ్యంలో.. ఈ పర్యటన భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరిపోస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ప్రధాని 'అమృత్ కాల్'.. దేశానికి
# 'విష్ కాల్'గా మారింది

(మొదటిపేజీ తరువాయి)

తుడిచివేయబడ్డాయి. తమ పిల్లల్ని చదివించుకునేందుకు కొందరు తండ్రులు అప్పులు చేశారు. కొందరు తల్లులు తమ బంగారాన్ని అమ్ముకున్నారు. పరీక్ష కోసం లక్షలాది మంది చిన్నారులు రాత్రంతా మేల్కొని చదువుకున్నారు. దానికి ప్రతిఫలంగా వారికి లభించింది ప్రశ్నపత్రాల లీకులు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యారంగంలో వ్యవస్థీకృత అవినీతి అని రాహుల్ ఎక్స్‌పోస్టులో తీవ్రస్థాయిలో మోదీ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ఇది కేవలం వైఫల్యం మాత్రమే కాదు.. యువత భవిష్యత్తుకు వ్యతిరేకంగా జరిగిన నేరం. ప్రతిసారి పేపర్ మాఫియా తప్పించుకుంటుంది. నిజాయితీపరులైన విద్యార్థులు శిక్ష అనుభవిస్తున్నారు. ఇప్పుడు జరిగిన నీట్ రద్దుతో లక్షలాది మంది విద్యార్థులు మరోసారి అదే మానసిక ఒత్తిడి, ఆర్థిక భారం, అనిశ్చితిని భరించాల్సి వస్తుంది. ఒకరి తలరాత కష్టంతో కాకుండా డబ్బు, పలుకుబడితో నిర్ణయించబడితే ఇక చదువుకు అర్థం ఏముంటుంది? రాహుల్ ప్రశ్నించారు. ప్రధాని మోడీ పిలిచే అమృత్ కాల్.. దేశానికి విష్ కాల్‌గా మారింది అని రాహుల్ తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

# నేడు బలపరీక్ష

(మొదటిపేజీ తరువాయి)

అయ్యారు. అన్నాడీఎంకే నేత, ఎమ్మెల్యే షణ్ముగం ఇంటికి టీవీకే అధ్యక్షుడు, తమిళనాడు సీఎం విజయ్ వెళ్లి కలిశారు. అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలకు షణ్ముగం నేతృత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విజయ్‌కు మద్దతు ఇస్తామని షణ్ముగం ప్రకటించిన నేపథ్యంలో ఆయన వర్గంతో విజయ్ సమావేశమయ్యారు. బుధవారం అసెంబ్లీలో బలపరీక్ష ఉన్న నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఏకైక ఎమ్మెల్యే కామరాజ్‌ను బహిష్కరించిన ఏఎంఎంకే**

తమిళనాడు ఎన్నికల్లో తమ పార్టీ నుంచి గెలుపొందిన ఏకైక ఎమ్మెల్యే కామరాజ్‌ను ఏఎంఎంకే నుంచి బహిష్కరించింది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత టీటీవీ దినకరన్ వెల్లడించారు. అధికార టీవీకే పార్టీకి ఏకపక్షంగా మద్దతు తెలిపి, పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా ప్రవర్తించినందుకు పార్టీలోని అన్ని పదవుల నుంచి, ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగిస్తున్నట్లు వివరించారు. అతడి విజయం కోసం పని చేసిన కార్యకర్తలు, నమ్మకంతో ఓటు వేసిన ప్రజలకు కామరాజ్ ద్రోహం చేశాడని విమర్శించారు. అసెంబ్లీలో సీఎం విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి కామరాజ్ మద్దతు ప్రకటించిన కొన్ని గంటలకే ఏఎంఎంకే అధినేత ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

**జ్యోతిష్యుడికి కీలక పదవి**

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన ఆస్థాన జ్యోతిష్యుడికి ప్రభుత్వంలో కీలక పదవిని కట్టబెట్టారు. రాధన్ పండిట్ వెట్రివేల్‌ను ముఖ్యమంత్రి రాజకీయ వ్యవహారాలకు ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. విజయ్ ముఖ్యమైన పనులను చేపట్టే ముందు వెట్రివేల్‌ను సంప్రదిస్తారని తెలుస్తోంది. ఇటీవల మే 10న మధ్యాహ్నం 3 గంటల 45 నిమిషాలకు ప్రమాణ స్వీకారం అనుకున్నప్పటికీ వెట్రివేల్ సూచనతో ముహూర్తాన్ని ఉదయం 10 గంటలకు విజయ్ మార్చుకోవడం విశేషం. తమిళ రాజకీయాల్లో చాలా కాలం నుంచి వెట్రివేల్ చక్రం తిప్పు తున్నారు. దివంగత సీఎం జయలలిత సైతం ఏ నిర్ణయం తీసుకోవాలన్నా ఈయననే సంప్రదిం చేవారని రాజకీయ వర్గాల్లో ప్రతీతి. బీజేపీ, కాంగ్రెస్, డీఎంకే, అన్నా డీఎంకే నేతలకు ఈయన ఆస్థాన జ్యోతిష్యుడిగా మారారు. ఎన్నికలకు చాలాకాలం ముందే విజయ్ జాతకాన్ని విశ్లేషించిన వెట్రివేల్, ఆయనకు రాజకీయాల్లో అదృష్టం కలిసివస్తుందని జోస్యం చెప్పినట్టు తెలిసింది.

**ప్రజలకు ఇబ్బంది కలిగించేవారిపై కఠిన చర్యలు: టీవీకే**

మరోవైపు ప్రజలకు అసౌకర్యం కలిగించేలా లేదా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా బహిరంగ ప్రదేశాల్లో పార్టీల బ్యానర్లు పెట్టడాన్ని నిషేధిస్తున్నట్లు అధికార టీవీకే పార్టీ నిర్ణయించింది. ఎవరైనా ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నట్లు తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కార్యకర్తలకు వార్నింగ్ ఇచ్చింది. పార్టీ ప్రచారాల గురించి కాకుండా, ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది.

## కేరళం కాంగ్రెస్ నేతలు
# రాహుల్‌తో భేటీ

(మొదటిపేజీ తరువాయి)

మల్లికార్జున ఖర్గేతో కాంగ్రెస్ సీనియర్ నేతలు సమావేశమయ్యారు. తాజాగా మంగళవారం కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి చేరుకుని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో చర్చలు జరపనున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు కె.సి వేణుగోపాల్, వి.డి సతీశన్, కె.సి వేణుగోపాల్, రమేష్ చెన్నితాల, కేరళ కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ అధ్యక్షులు కె. సుధాకరన్‌లు ఢిల్లీకి చేరుకున్నారు. ముఖ్యంగా కె.సి వేణుగోపాల్‌నే సిఎంను చేసేందుకు కాంగ్రెస్ అధిష్టానం మొగ్గు చూపుతుందని తెలుస్తోంది. బహుశా కేరళం సిఎం ఎవరనేది రాహుల్‌తో చర్చలు అనంతరం బయటకు వెల్లడించే అవకాశం ఉంది.

# నీట్ పరీక్ష రద్దు

(మొదటిపేజీ తరువాయి)

551 నగరాలు, ఇతర దేశాల్లోని 14 సిటీల్లో నిర్వహించిన ఈ పరీక్ష?కు దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. తాజాగా పరీక్షను రద్దు చేస్తూ ఎన్‌టీఏ నుంచి ఊహించని ప్రకటన రావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్ర నైరాశ్యం నెలకొంది.

**సీబీఐ దర్యాప్తు.. కేసు నమోదు**

పేపర్ లీకేజీ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని కేంద్రం నుంచి ఆదేశాలు రావడంతో సీబీఐ రంగంలోకి దిగింది. కేంద్ర విద్యాశాఖ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసింది. నేరపూరిత కుట్ర, మోసం, ఇతర నేరాలకు సంబంధించి బీఎన్‌ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు అధికారులు వెల్లడించారు. కాగా ఈ కేసును దర్యాప్తు చేస్తున్న రాజస్తాన్ పోలీసుల స్పెషల్ ఆపరేషన్ గ్రూపు నుంచి సమాచారాన్ని సేకరించేందుకు త్వరలోనే అక్కడికి ఓ బృందాన్ని అధికారులు పంపనున్నారు. విచారణకు అవసరమైన అన్ని రికార్డులనూ సీబీఐకి అందించి పూర్తిగా సహకరిస్తామని ఎన్‌టీఏ స్పష్టం చేసింది.

**మహారాష్ట్రలో ఒకరి అరెస్ట్**

మహారాష్ట్ర పోలీసులు నీట్ లీకేజీ వ్యవహారంలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు. నాశిక్‌లో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని పోలీసు అధికారి డీసీపీ కిరణ్‌కుమార్ చెప్పారు. రాజస్తాన్ నుంచి పోలీసుల బృందం వచ్చి ఆయనను కస్టడీలోకి తీసుకుంటుందని తెలిపారు. ఇటు పేపర్ లీకేజీ వ్యవహారం కూడా రాజకీయంగా తీవ్ర దుమారాన్నే రేపుతోంది. వరుస లీకేజీ ఘటనలపై కేంద్రం వైఫల్యాన్ని పలు పార్టీల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

**పేపర్ లీక్‌పై సరైన విచారణ జరపాలి**

నీట్ పేపర్ లీక్‌పై సరైన విచారణ జరపాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆలిండియా అధ్యక్షుడు ఆదర్శ్ ఎం సాజి డిమాండ్ చేశారు. మే 3న జరిగిన నీట్ యూజీ-2026 పరీక్ష రద్దుకు దారితీసిన ప్రశ్నపత్ర లీకేజీపై మంగళవారం విద్యా మంత్రిత్వ శాఖ కార్యాలయం వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళన చేపట్టింది. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ నేతలు నినాదాలు హోరెత్తించారు. పోలీసులకు, ఎస్‌ఎఫ్‌ఐ నేతలకు మధ్య తోపులాట జరిగింది. ఎస్‌ఎఫ్‌ఐ నేతలను పోలీసులు ఈడ్చుకెళ్లి వాహనాల్లోకి నెట్టి అరెస్టులు చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆలిండియా అధ్యక్షుడు ఆదర్శ్ ఎం సాజి మాట్లాడుతూ... నీట్ పెట్టినప్పటి నుంచీ పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరుగుతున్నాయన్నారు. పరీక్షల నిర్వహణలో ఎన్టీఏ తన అసమర్థతను మరోసారి నిరూపించుకుందని విమర్శించారు. మొత్తం 720 మార్కులకు గాను దాదాపు 600 మార్కులు తారుమారు చేశారని, ఇది పరీక్ష సమగ్రతను తీవ్రంగా దెబ్బతీసిందని దుయ్యబట్టారు. పరీక్షలోని 180 ప్రశ్నల్లో దాదాపు 15 ప్రశ్నలు ఒక నమూనా ప్రశ్నపత్రంతో ముందుగానే పంపిణీ చేశారని, కెమిస్ట్రీ విభాగం నుంచి సుమారు 120 ప్రశ్నలు యథాతథంగా లీక్ అయ్యాయనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ప్రతిష్టాత్మక నీట్ పరీక్షలలో జరుగుతున్న అవకతవకలకు మోడీ ప్రభుత్వమే నేరుగా బాధ్యత వహించాలని అన్నారు. పరీక్షల వ్యవస్థను కేంద్రీకరించడానికి మోడీ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల కలిగే దుష్ప్రభావాలను ఎస్‌ఎఫ్‌ఐతో సహా విద్యార్థి సంఘాలు, సమాజంలోని ఇతర వర్గాలు మొదటి నుంచే ఎత్తి చూపాయని తెలిపారు. మోడీ ప్రభుత్వం చేపట్టిన కేంద్రీకరణ ప్రయత్నాల ఫలితంగా దేశంలోని అనేక ప్రాంతాల్లో పరీక్షల మాఫియాలు పుట్టు కొచ్చేందుకు మార్గం సుగమం చేశారని విమర్శించారు. భారీ స్థాయిలో ప్రవేశ పరీక్షల కోచింగ్ మార్కెట్‌ను ప్రోత్స హించి, నిస్సహాయ స్థితిలో ఉన్న దేశ మధ్యతరగతిని దోపి డీ, అభద్రతలోకి నెట్టివేసిందని ఆందోళన వ్యక్తం చేశారు.

**అరెస్టు చేసిన నేతలను విడుదల చేయాలి**

నీట్ పరీక్ష రద్దు ప్రకటనకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలను అరెస్టు చేయడాన్ని ఆ సంఘం కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. తక్షణం నాయకులను విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం బలప్రయోగంతో విద్యార్థుల పోరాటాన్ని అణచివేయలేదనీ, ఎన్టీఏకు వ్యతిరేకంగా ఎస్‌ఎఫ్‌ఐ తన ఉద్యమాన్ని కొనసాగిస్తుందనీ స్పష్టం చేశారు.

## అస్సాం సీఎంగా రెండోసారి
# హిమంత బిశ్వ శర్మ..





(మొదటిపేజీ తరువాయి)

స్వీకారం చేయించారు. అస్సాం సంప్రదాయ వస్త్రధారణలో ఉన్న శర్మ, ప్రమాణం చేస్తున్న సమయంలో పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హిమంతతో పాటు మరో ఐదుగురు మంత్రులుగా ప్రమాణం చేశారు. వీరిలో కేంద్ర మాజీ మంత్రి రామేశ్వర్ తేలి, అసోం గణ పరిషత్ (ఏజీపీ) అధ్యక్షుడు అతుల్ బోరా, యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్ (యూపీపీఎల్) నేత చరణ్ బోరో, సీనియర్ బీజేపీ నేత అజంత నియోగ్ ఉన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్‌తో పాటు 22 ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బీజేపీ జాతీయ నాయకులు హాజరయ్యారు. వీరితో పాటు అస్సాంలోని వైష్ణవ మఠాలకు చెందిన 15 మంది సత్రాధికారులు వంటి ప్రముఖ మత పెద్దలు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి స్పష్టమైన ఆధిక్యంతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో హిమంత బిశ్వ శర్మ రెండోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. ఆయన తొలిసారిగా 2021లో సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన నాయకత్వంలో బీజేపీ ఈశాన్య రాష్ట్రమైన అస్సాంలో తన రాజకీయ ఆధిపత్యాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. ప్రమాణ స్వీకారానికి ముందు బీజేపీ, ఎన్డీయే శాసనసభా పక్ష నేతగా హిమంత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఆయన గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరారు.

# కలెక్టర్లదే బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని సూచించారు. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవడం తోపాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్‌కు తరలించాలని ఆదేశించారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించ వద్దనీ, అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని చెప్పారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాలని, ప్రతీ అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు. పలు చోట్ల గోడౌన్ల సమస్యలు ఉన్నట్లు తెలుస్తోందని, అలాంటి ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. రైతుబజార్ లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

**పోలీసుల సహాయం తీసుకోండి**

మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలనీ, అవసరమైన చోట్ల పోలీసుల సహాయం తీసుకోవాలని చెప్పారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)కి రిపోర్ట్ పంపించాలని ఆదేశించారు. అకాల నష్టనివారణకు శాశ్వత పరిష్కారాలు సూచించండి అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. కల్లాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక అధికారిని నియమించాలని చెప్పారు.

ఐకేపీ కేంద్రాల్లో ప్రత్యేక అధికారిని నియమించడం ద్వారా కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రతీ రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. ధాన్యం లోడింగ్ లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని సూచించారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలని, దీనివల్ల తాలు, తరుగు పేరుతో చేసే అక్రమాలను నిలువరించవచ్చని సూచించారు. లారీల కొరతను అధిగమించేందుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇవన్నీ కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయనీ, ఆ బాధ్యతల్ని సమర్థవంతంగా స్వీకరించేందుకు ముందుకు రావాలని చెప్పారు.

**బాధ్యతాయుతంగా వ్యవహరించండి**
**- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో కలెక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. జిల్లాల్లో ఎక్కడ సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావలని, వాటి పరిష్కారానికి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

**సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం తరలింపు వల్లే**
**సమస్యలు : మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు కొందరు తమ ధాన్యాన్ని తెలంగాణలోని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారననీ, దీనివల్ల కొన్నిచోట్ల సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు.

సరిహద్దు రాష్ట్రాల రైతులు ధాన్యం తీసుకురాకుండా సంబంధిత జిల్లా కలెక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరులోగా ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో విభిన్న వాతావరణం

(మొదటిపేజీ తరువాయి)

వీటి ప్రభావంతో ఈ నెల 13న బుధవారంనాడు అల్లూరి సీతారామరాజు, పోలవరం, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ఎస్పిఎస్ఆర్ నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జికే వీధి, ముంచింగిపుట్టు, పెదబయలు, పోలవరం జిల్లాలోని చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం, గుర్తేడు మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని, కొన్నిప్రాంతాల్లో ఎండ ప్రభావం చూపే అవకాశం ఉందని చెప్పారు.

## సంపాదకీయం

# బంగారం కొనొద్దని ప్రధాని మోదీ ఎందుకు...

దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది.. మనం దేశభక్తిని నిరూపించుకోవాల్సిన సమయం వచ్చింది.. అయితే అందుకోసం పెద్దపెద్ద త్యాగాలు చేయాల్సిన పని లేదు.. కానీ మన రోజువారీ పనుల్లో కొన్ని మార్పులు చేసుకుంటే సరిపోతుందని సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన బిజెపి బహిరంగ సభలో ప్రధాని మోదీ అన్నారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా మళ్లీ కోవిడ్ కాలం నాటి పని సంస్కృతిని ప్రజలందరూ అలవాటు చేసుకోవాలని సూచించారు.భారతదేశంలో బంగారం కేవలం ఒక లోహం మాత్రమే కాదు.. దీనిని సంప్రదాయానికి, సంపదకు, సామాజిక హోదాకు చిహ్నంగా భావిస్తారు. ముఖ్యంగా వివాహాలు, దీపావళి, అక్షయ తృతీయ వంటి పండుగల సమయాల్లో బంగారం కొనుగోళ్లు గరిష్ట స్థాయికి చేరుకుంటాయి. కొన్ని గణాంకాల ప్రకారం.. భారతీయులు ఏటా సగటున 700 నుండి 800 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేస్తున్నారని తెలుపుతున్నాయి. ప్రపంచంలోనే అత్యధికంగా బంగారాన్ని వినియోగించే దేశాల్లో భారత్ ఒకటిగా నిలవడానికి ఇక్కడి ప్రజలకు ఈ పసిడిపై ఉన్న మక్కువనే ప్రధాన కారణం. అయితే ఇటీవల మోదీ బంగారం ఎక్కువగా కొనుగోలు చేయొద్దని ప్రకటన చేశారు. అలా ఎందుకు చేయాల్సి వచ్చిందిదేశంలో బంగారానికి భారీ డిమాండ్ ఉంది. కానీ ఇందుకు విరుద్ధంగా మన దేశీయ ఉత్పత్తి అత్యంత స్వల్పంగా ఉంది. ఏటా కేవలం 1 నుండి 2 టన్నుల బంగారం మాత్రమే మన గనుల నుండి లభిస్తోంది. దీనివల్ల దాదాపు 90 శాతం కంటే ఎక్కువ డిమాండ్‌ను విదేశీ దిగుమతుల ద్వారానే తీర్చుకోవాల్సి వస్తోంది. ముడిచమురు తర్వాత భారత్ అత్యధికంగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేస్తున్నది బంగారం దిగుమతుల కోసమే. దీనివల్ల దేశ కరెంట్ అకౌంట్ లోటు పెరిగి, రూపాయి విలువపై, విదేశీ మారక నిల్వలపై తీవ్ర ఒత్తిడి పడుతోంది.ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బంగారం కొనుగోళ్లను తగ్గించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల తెలంగాణలో పర్యటించినప్పుడు తెలిపారు. కనీసం ఏడాది పాటు కొత్త బంగారం కొనకుండా ఉండటం వల్ల దేశం నుంచి బయటకు వెళ్లే విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయవచ్చని, ఆ నిధులను దేశాభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పసిడిపై పెట్టుబడి పెట్టడం వల్ల అది వ్యక్తిగతంగా లాభదాయకంగా అనిపించినప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థ పరంగా అది 'డెడ్ ఇన్వెస్ట్‌మెంట్' గానే మిగిలిపోతుందనేది నిపుణుల వాదన.బంగారం కొనుగోళ్లను తగ్గించడానికి ప్రభుత్వం 'సావరిన్ గోల్డ్ బాండ్' పథకాన్ని ప్రవేశపెట్టింది. భౌతికంగా బంగారాన్ని కొని లాకర్లలో దాచుకోవడం కంటే, బాండ్ల రూపంలో పెట్టుబడి పెట్టడం వల్ల విదేశీ దిగుమతుల భారం తగ్గుతుంది. దీనివల్ల వినియోగదారులకు భద్రతతో పాటు అదనపు వడ్డీ కూడా లభిస్తుంది. ప్రజలు తమ పెట్టుబడి దృక్పథాన్ని మార్చుకుని, భౌతిక బంగారం నుంచి డిజిటల్ , బాండ్ల వైపు మళ్ళినప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది అని ఆర్థిక నిపుణులు అంటున్నరు.స్టాక్ మార్కెట్‌లో బ్లడ్ బాత్ చూడగానే అర్థమైంది అందరికి. మోదీ ఇచ్చింది స్టేట్‌మెంట్ కాదు అదొక వార్నింగ్ సిగ్నల్ అని. పొలిటికల్‌గా, ఒక పొలిటీషియన్‌గా నరేంద్ర మోదీ ఎంత అగ్రెసివ్‌గానైనా మాట్లాడొచ్చు. కాని, దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన మ్యాటర్ అయితే మాత్రం.. ప్రతి అక్షరాన్ని, ప్రతి పొల్లును కొలతకొలిచినట్టు మరీ మాట్లాడతారు. అంతా సుభిక్షం, అంతా ప్రశాంతం అనాల్సిన మూమెంట్‌లో... 'జాగ్రత్తగా ఉండండి' అని అన్నారంటే, కచ్చితంగా 'దేశం క్లిష్ట పరిస్థితి'లో ఉందనే అర్థం. భయపెట్టాలని కాదు గానీ.. దేశ ప్రజలను ముందస్తుగా ప్రిపేర్ చేస్తున్నట్టు కనిపిస్తోంది ఆ మాటల్లో. సేవింగ్స్ మొత్తం ఖర్చైపోవచ్చు. ఏదైనా జరగొచ్చు. మోదీ మాటలను డీకోడ్ చేస్తే వచ్చే అర్థం ఇదే. భారతదేశం ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగారు వినియోగదారు. ఏటా సగటున 700 నుండి 900 టన్నుల బంగారాన్ని మనం దిగుమతి చేసుకుంటున్నాం. ఇక్కడే అసలు సమస్య మొదలవుతోంది. మనం దిగుమతి చేసుకునే ప్రతి గ్రాము బంగారానికి అమెరికన్ డాలర్లలో చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా ఏటా 35-45 బిలియన్ డాలర్లు బంగారం దిగుమతులకే ఖర్చవుతాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర ట్రాయ్ ఔన్సుకు 3,000 డాలర్లు దాటడంతో ఈ బిల్లు తడిసి మోపెడవుతోంది.ఒకవైపు పసిడి ధరలు భగ్గుమంటుంటే, మరోవైపు మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాల వల్ల ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 126 డాలర్లకు చేరుకున్నాయి. దేశం నడవాలంటే చమురు తప్పనిసరి. మనం మన అవసరాల్లో 85శాతం దిగుమతి చేసుకుంటున్నాం. చమురుతో పోలిస్తే బంగారం కొనుగోలు అనేది ఒక ఆప్షన్ మాత్రమే..ముఖ్యంగా పెళ్లిళ్ల కోసం కొనే బంగారాన్ని వాయిదా వేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊరట లభిస్తుంది.దేశం యొక్క ఆర్థిక స్కోర్‌కార్డ్‌నే కరెంట్ ఖాతా అంటారు. మనం ఎగుమతుల ద్వారా సంపాదించే దానికంటే, దిగుమతుల కోసం ఖర్చు చేసేది ఎక్కువైతే లోటు ఏర్పడుతుంది. ఈ లోటు పెరిగితే రూపాయి విలువ పడిపోయి, ఆర్థిక వ్యవస్థ అస్థిరంగా మారుతుంది.భారతదేశంలో ఏటా సుమారు 10-12 మిలియన్ల వివాహాలు జరుగుతాయి. అక్టోబర్ నుండి ఫిబ్రవరి వరకు ఉండే పెళ్లిళ్ల సీజన్‌లోనే దేశంలో అత్యధికంగా బంగారం అమ్ముడవుతుంది. "ఇది నిషేధం కాదు, కేవలం ఒక నైతిక విజ్ఞప్తి మాత్రమే. దేశం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు పౌరులు స్వచ్ఛందంగా తమ కొనుగోళ్లను వాయిదా వేసుకుంటే, అది దేశ విదేశీ మారక నిల్వలను కాపాడుతుంది" అని ఆర్థిక విశ్లేషకుల అభిప్రాయపడుతున్నారు.క్లుప్తంగా చెప్పాలంటే, మళ్లీ లాక్‌డౌన్ పరిస్థితులు రాకుండా ఉండాలన్నా, రాబోయే ప్రపంచ ఆర్థిక సంక్షోభ పరిస్థితుల నుండి సామాన్యులను, దేశ ఆర్థిక వ్యవస్థను రక్షించడానికి, ప్రజల్లో క్రమశిక్షణ, పొదుపు అనే ముందస్తు జాగ్రత్తలను అలవాటు చేసేందుకే ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్టు తెలుస్తోంది



# కేరళంలో కొనసాగుతున్న గందరగోళం



**తిరువనంతపురం– సూర్య వాస్తవం:** ఇటీవల ఎన్నికలు జరిగిన పశ్చిమ్ బెంగాల్, తమిళనాడు, కేరళలో ప్రభుత్వాలు మారగా. అసోం, పుదుచ్చేరిలో అధికారంలో ఉన్న పార్టీలు విజయం సాధించాయి. అయితే, పదేళ్ల తర్వాత కేరళలో కాంగ్రెస్ కూటమి మళ్లీ అధికారంలోకి వచ్చింది. కానీ, అక్కడ సీఎం అభ్యర్థి ఎవరు? అనేది మాత్రం ఎటూ తేల్చుకోలేని పరిస్థితి నెలకుంది. సీఎం పదవి కోసం ముగ్గురు నాయకులు పోటీ పడుతున్నారు. వీరిలో ఎవరివైపు కాంగ్రెస్ హైకమాండ్ మొగ్గుచూపుతుందనేది ఆసక్తికరంగా మారింది. కేరళం ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకత్వంలోని యూడీఎఫ్ కూటమి ఘన విజయం సాధించినా.. ముఖ్యమంత్రి ఎంపిక విషయంలో హస్తం పార్టీ మల్లగుల్లాలు పడుతోంది. కేరళంతో పాటు ఎన్నికలు జరిగిన పశ్చిమ్ బెంగాల్, తమిళనాడులో ప్రభుత్వాలు కొలువుదీరగా.. అసోం, పుదుచ్చేరిలో ప్రస్తుతం సీఎంలే కొనసాగనున్నారు. కానీ, కేరళం విషయంలో కాంగ్రెస్ తమ సీఎం ఎవరు? అనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదు. సీఎం పదవి రేసులో వీడీ సతీషన్ , కేసీ వేణుగోపాల్, రమేష్ చెన్నితాల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అయితే, సీఎం పదవి ఆశిస్తున్న సతీషన్.. తాను మరో పదవిని స్వీకరించడానికి సిద్ధంగా లేనని స్పష్టంగా చెప్పినట్టు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. అంతేకాదు, అధిష్ఠానం మనసులోనూ ఆయనకు సీఎం పదవి ఇవ్వాలనే ఆలోచన లేన్నట్టు తెలుస్తోంది.వారంగా కొనసాగుతున్న ఈ ప్రతిష్టంభన 2023 నాటి కర్ణాటక పంచాయతీని గుర్తుకుతెస్తోంది. ముఖ్యమంత్రి పదవి కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌ల మధ్య అప్పట్లో యుద్ధమే నడిచింది. రాహుల్ గాంధీతో పాటు కేసీ వేణుగోపాల్ నేతృత్వంలోని ఏర్పడే ప్రభుత్వంలో సతీసన్‌కు కీలక బాధ్యతలు అప్పగించాలనే కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం భావిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అలాగే, రమేష్ చెన్నితాలను శాసనసభ స్పీకర్‌గా నియమించే అవకాశం ఉంది.అయితే, ప్రజలతో పాటు యూడీఎఫ్ భాగస్వామ్య పక్షమైన ఐయూఎంఎల్ మద్దతు ఉన్న సతీషన్ ఆ పాత్రను అంగీకరించడానికి సిద్ధంగా లేరు. ఇది కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేసింది. శాసనసభ పక్షంలోని మెజారిటీ అభిప్రాయాన్ని తోసిపుచ్చడం, అలాగే మిత్రపక్షాల అభిప్రాయాలను విస్మరించడం కూడా తేలిక కాదు. ఈ ప్రతిష్టంభనకు పరిష్కారం కోసం కేరళ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్లతో రాహుల్ గాంధీ మంగళవారం ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారని వర్గాలు తెలిపాయి. సతీషన్, చెన్నితాల వైఖరిపై పార్టీ హైకమాండ్ ఇప్పటికే అసంతృప్తిగా ఉందని వర్గాలు పేర్కొన్నాయి.కర్ణాటకలో నాయకత్వ మార్పుపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో సతీసన్ అసంతృప్తి వల్ల జరిగే నష్టం గురించి పార్టీ నాయకత్వానికి బాగా తెలుసు. అంతేకాకుండా, వేణుగోపాల్‌ను సీఎంగా నియమిస్తే ఆయన ఎంపీ పదవికి రాజీనామా చేసి, ఉప ఎన్నికలో పోటీ చేయాల్సి ఉంటుంది. అదే సమయంలో లోక్‌సభ స్థానానికి కూడా ఉప ఎన్నిక వస్తుంది. కాబట్టి ఇది కాంగ్రెస్‌కు తలనొప్పిని మరింత పెంచుతుంది.కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు మాట్లాడుతూ.. ఈ నిర్ణయం చాలా ముఖ్యమైందని, అన్ని అంశాలపై చర్చించడానికి సమయం పడుతుందని అన్నారు. జాప్యం వల్ల ఎలాంటి నష్టం జరగదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేరళ అసెంబ్లీకి మే 23తో గడువు ముగియనుందని, ఈలోగా పరిష్కార మార్గాన్ని కనుగొంటామని చెప్పారు.

# బండి విషయంలో సీఎం ఎంట్రీ...



**కరీంనగర్-సూర్య వాస్తవం:** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. ఒక మైనర్ బాలిక పట్ల అసభ్య ప్రవర్తనకు పాల్పడ్డారన్న ఆరోపణలు, దానిపై నమోదైన కేసులు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీ యాంశమయ్యాయి. ఈ ఉదంతాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. బాధితులకు న్యాయం చేయడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్ష పాతంగా విచారణ జరపాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు.ఈ కేసు నమోదులో జరిగిన జాప్యంపై సీఎం రేవంత్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. దీనిపై డీజీపీ సీవీ ఆనంద్‌ను స్వయంగా పిలిపించి వివరణ కోరారు. ఈ నెల 8నే బాధితులు ఫిర్యాదు చేసినప్పటికీ, నిందితులపై చర్యలు తీసుకోవడంలో ఆలస్యం జరగడంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసు యంత్రాంగం భద్రతా ఏర్పాట్లలై నిమగ్నమైందని, అందుకే జాప్యం జరిగిందని డీజీపీ సీవీ ఆనంద్ వివరణ ఇచ్చారు.కేసు పూర్వాపరాలను నిశితంగా పరిశీలించిన ముఖ్యమంత్రి, తక్షణమే సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపాలని, ఎక్కడా సాక్ష్యాలు తారుమారు కాకుండా పారదర్శకమైన నివేదికను సమర్పించాలని స్పష్టం చేశారు. "న్యాయం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని" అధికారులను హెచ్చరించారు.తన 17 ఏళ్ల కుమార్తెను భగీరథ్ వేధిస్తున్నాడంటూ ఓ తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పేట్‌బషీరాబాద్ పోలీసులు రంగంలోకి దిగారు. బాధితురాలు మైనర్ కావడంతో నిందితుడిపై కఠినమైన సెక్షన్లను ప్రయోగించారు. బాలికపై లైంగిక వేధింపులు, అనుచిత ప్రవర్తన వంటి అంశాల ఆధారంగా ఈ అభియోగాలు మోపారు.కేసు విచారణ సాగుతుండగానే ఈ ఉదంతం మరో మలుపు తిరిగింది. సదరు బాలిక తల్లిదండ్రులు తనను డబ్బుల కోసం బెదిరిస్తున్నారంటూ భగీరథ్ కరీంనగర్ పోలీసులను ఆశ్రయించారు. తన ప్రతిష్ఠను భంగం కలిగించేలా బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ మేరకు కరీంనగర్ టూటౌన్ పోలీసులు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. దీంతో ఈ కేసు ఇరుపక్షాల ఫిర్యాదులతో క్లిష్టంగా మారింది.రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించినట్లు తెలుస్తోంది. కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్ రెడ్డి ఇప్పటికే సైబరాబాద్ సీపీ నుంచి పూర్తి స్థాయి నివేదికను తెప్పించుకున్నారు. దీనిపై లోతైన విచారణ జరిపేందుకు కమిషన్ ఒక ప్రత్యేక బెంచ్ ను ఏర్పాటు చేసింది. బాలిక భద్రత, మానసిక స్థితిని దృష్టిలో ఉంచుకుని కమిషన్ విచారణను వేగవంతం చేయనుందిముఖ్యమంత్రి నేరుగా జోక్యం చేసుకోవడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.

రాబోయే 24 గంటల్లో ప్రత్యేక బృందాలు బాధితులు, సాక్షుల నుంచి వాంగ్మూలాలను సేకరించనున్నాయి. బాధితురాలి స్టేట్‌మెంట్ ఆధారంగా ఈ కేసులో తదుపరి అరెస్టులు లేదా ఇతర చర్యలు ఉండవచ్చు. రాజకీయంగా కూడా ఈ అంశం కాక రేపుతోంది. విచారణ పారదర్శకంగా జరగాలని అధికార పక్షం అంటుంటే, రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే తమ కుమారుడిని ఇరికించారని బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి. ఏది ఏమైనా, చట్టం తన పని తాను చేసుకుపోతుందని, శాంతిభద్రతల విషయంలో ఎవరికీ మినహాయింపు ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# విజయ్ టీమ్ లో ఎవరీ విష్ణురెడ్డి...

**తిరుపతి-సూర్య వాస్తవం:** తమిళనాడు రాజకీయాల్లో తెలుగు వ్యక్తుల గురించి ఇటీవల సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. తమిళనాడు సీఎం విజయ్ మంత్రివర్గంలో శివకాశి ఎమ్మెల్యే కీర్తనకు అవకాశం దక్కటంపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. అలాగే ప్రమాణ స్వీకారానికి ముందు టీవీకే చీఫ్ విజయ్.. తమిళనాడు గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌ను కలిసిన ఫోటో కూడా సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అవుతోంది. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలంటూ విజయ్ గవర్నర్‌ను కోరేందుకు వెళ్లిన సమయంలో పలువురు విజయ్ వెంట ఉన్నారు. ఈ క్రమంలోనే అందులో ఉన్న విష్ణు రెడ్డి అనే వ్యక్తి ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారారు.ఎవరీ విష్ణు రెడ్డి.. సోషల్ మీడియాలో ఈ వ్యక్తిపై ఇటీవల విపరీతంగా చర్చ జరుగుతోంది. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఆహ్వానించాలంటూ టీవీకే అధినేత విజయ్.. గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌ను కలిసిన సమయంలో విష్ణు రెడ్డి అక్కడే ఉన్నారు. ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ కావటంతో.. ఎవరీ విష్ణు రెడ్డి అనే చర్చ మొదలైంది. ఈ క్రమంలోనే ఈయన ఏపీకి చెందినవారని.. ఏపీ మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డికి సమీప బంధువు అవుతారని.. బావమరిది అవుతారంటూ వార్తలు వస్తున్నాయి.టీవీకే అధినేత విజయ్‌కు అత్యంత నమ్మకస్తుడు, సన్నిహితుడిగా పేరొందిన విష్ణువర్ధన్ రెడ్డి గురించి తమిళ మీడియాతో పాటు తెలుగు మీడియాలోనూ చర్చ జరుగుతోంది. ఈయన పేరు ఎర్రదొడ్డి విష్ణువర్ధన్ రెడ్డి. గ్రానైట్ క్వారీల వ్యాపారం చేస్తుంటారు. ఈయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా కలికిరి మండలం ఎర్రదొడ్డిపల్లె. పదిహేనేళ్లుగా గ్రానైట్ వ్యాపారం చేస్తున్న విష్ణు రెడ్డి.. చెన్నైలోనే స్థిరపడ్డారు. విష్ణువర్ధన్ రెడ్డి కుటుంబానికి పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ ఉంది. ఈయన తండ్రి రామనారాయణరెడ్డి వైఎస్ ఎంపీపీగా గతంలో పనిచేశారు. అద్దవారిపల్లె సర్పంచ్, మహల్ ఎంపీటీసీ, కలికిరి మండలానికి వైస్ ఎంపీపీగానూ వ్యవహరించారు. మరోవైపు విష్ణు రెడ్డి.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి సమీప బంధువు కావటం విశేషం. విష్ణు రెడ్డి తల్లి, రామనారాయణ రెడ్డి భార్య.. కలికిరి మాజీ ఎంపీపీగా పనిచేసిన నల్లారి ఆనంద రెడ్డికి సోదరి అవుతారు. సోషల్ మీడియా నిర్వహణ, ఆర్థిక వ్యవహారాల్లోనూ విజయ్ పార్టీకి అండగా ఉన్నారని తమిళ మీడియాలో చర్చ జరుగుతోంది. విజయ్ సినిమాల పర్యవేక్షణలోనూ విష్ణు రెడ్డి పాత్ర ఉంటుందంటూ ప్రచారం జరుగుతోంది.

# రాష్ట్ర ఆభివృద్ధే ఎన్డీఏ ప్రభుత్వ ధ్యేయం

## - వై.నాగేశ్వరరావు యాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు

**కర్నూల్ - సూర్య వాస్తవం :** కర్నూలు నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు మంగళవారం జిల్లా అధ్యక్షురాలు గుడిసే కృష్ణమ్మ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర స్థాయి, జిల్లాస్థాయి టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వై. నాగేశ్వర రావు యాదవ్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 23 నెలలు పూర్తి చేసుకున్న సందర్భంగా పేదల సంక్షేమం కోసం ఎన్ డి.ఏ ప్రభుత్వం పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం జరిగింది . అందులో సూపర్ సిక్స్ పథకాలైన తల్లికి వందనం, స్త్రీ శక్తి, దివ్యాంగ శక్తి, దీపం పథకం అన్నా క్యాంటీన్లు, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, మత్స్యకారుల కొరకు సంవత్సరానికి 20,000 మాస్యకారులకు అందించడం జరిగింది. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 10,000, అలాగే బాలింతలకు బేబీ కిట్లు, పి 4 ద్వారా పేదరిక నిర్మూలన, 5.5 లక్షల పేదలకు సొంత ఇల్లు అందజేయడం జరిగింది. రాష్ట్రంలో సగానికి పైగా ఉన్న బీసీల కొరకు ఎన్డీఏ ప్రభుత్వం రక్షణ చట్టాన్ని తీసుకొని వచ్చి బీసీలకు అండగా నిలిచింది. గత ప్రభుత్వం బీసీలపై దాడులు నిర్వహించి, హత్యలు చేయించి భయభ్రాంతులకు లోను చేసి బీసీలకు రక్షణ లేకుండా చేసి ఆర్థికంగా కృంగదీసింది. అలాంటి పరిస్థితుల్లో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చి బీసీలకు రక్షణగా



రక్షణ చట్టాన్ని తీసుకురావడం జరిగింది. అలాగే వివిధ కార్పొరేషన్లలో ఎమ్మెల్యే పదవులు, ఎమ్మెల్సీ పదవులు, నామినేటెడ్ పోస్టులు బీసీలకు అందించి బీసీలను ఒక స్థాయిలో నిలబెట్టిన ప్రభుత్వం ఎన్డీఏ ప్రభుత్వం. విద్యాపరంగా లోకేష్ బాబు బీసీలకు బీసీ హాస్టల్ లను అభివృద్ధి చేయడం, పిల్లలకు క్వాలిటీ అండ్ క్వాంటిటీ ఫుడ్ అందించారు. విద్యారంగంలో అనేక మార్పులు తీసుకొని వచ్చి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడం జరిగింది. మెగా డీఎస్సీ ద్వారా టీచర్ల నియామకం చేపట్టడం జరిగింది. అలాగే కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేసి, అమరావతి నిర్మాణం చేపట్టడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు పెట్టుబడులు తీసుకొని వచ్చి ఐటీ రంగాన్ని అభివృద్ధి పరచడం జరిగింది. వ్యవసాయ రంగంలో రైతుల సంక్షేమమే ముఖ్యంగా రైతుల కొరకు ప్రత్యేక పథకాలను ప్రవేశ పెట్టడం జరిగింది. అలాగే సమర్థమైన నీటి నిర్వహణ చేపట్టి రైతులకు మరియు ప్రజలకు ఎలాంటి నీటి కొరత లేకుండా చేయడం జరిగింది. విద్యా వైద్య రంగాలలో సరికొత్త విధానాలు పాటించి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకొని పోతున్న ఎన్డీఏ, ప్రభుత్వానికే సాధ్యమని తెలియజేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

## -ఎమ్మెల్యే జేసీ అశ్విత్ రెడ్డి క్షేత్రస్థాయి పర్యటన



**తాడిపత్రి - సూర్య వాస్తవం :** తాడిపత్రి పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే జేసీ అశ్విత్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. ముఖ్యంగా వడ్లపాలెం, రెడ్డివారి పాలెం ప్రాంతాలలో పర్యటించి, స్థానిక ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న మౌలిక సదుపాయాల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. పర్యటనలో భాగంగా డ్రైనేజీ సమస్యలు, త్రాగునీటి సరఫరా, వీధి దీపాల వంటి పలు సమస్యలను స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కరాఖండిగా ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని, ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా ప్రజలకు భరోసా ఇచ్చారు. ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని వాటిని తీర్చడమే నా బాధ్యత. ప్రతి సమస్యను ట్రాక్ చేసి, అవి పరిష్కారమయ్యే వరకు అధికారులతో సమన్వయం చేసుకుంటాం. జేసీ అశ్విత్ రెడ్డి, ఎమ్మెల్యే ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# ఈదుర గాలులతో నిలిచిన విద్యుత్ సరఫరా

## - రాత్రంతా చీకట్లోనే గ్రామాల ప్రజలు



**పెద్దపప్పూరు - సూర్య వాస్తవం :** పెద్దపప్పూరు మండలం పసులూరు, సుంకేసుల పల్లి గ్రామాల్లో సోమవారం సాయంత్రం వీచిన భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. ఈ గాలుల ధాటికి పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. రాత్రి వరకు కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడలేదు. చీకట్లో గడపాల్సి రావడంతో వృద్ధులు, చిన్న పిల్లలు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించి, యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని విద్యుత్ శాఖాధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

# ఈదురు గాలుల బీభత్సం

## - కుదేలైన అరటి, నిమ్మ రైతులు



**తాడిపత్రి- సూర్య వాస్తవం :** యాడికి మండలంలో అకస్మాత్తుగా వీచిన భారీ ఈదురు గాలులు అన్నదాతను నిలువునా ముంచాయి. గాలివాన ధాటికి మండలంలోని పలు గ్రామాల్లో అరటి, నిమ్మ తోటలు భారీగా దెబ్బతిన్నాయి. గాలి వేగానికి గెలలతో ఉన్న అరటి చెట్లు విరిగి పడ్డాయి. నెలల తరబడి కష్టపడి పెంచిన పంట కళ్లముందే నేలకూలడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. కాత దశలో ఉన్న నిమ్మ చెట్లు కూకటి వేళ్లతో సహా పెకిలించుకుపోయాయి. మరికొన్ని చోట్ల కాయలు రాలిపోయి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఇప్పటికే మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక సతమతమవుతున్న రైతులకు, ఈ ప్రకృతి వైపరీత్యం కోలుకోలేని దెబ్బ తీసింది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టపోయిన ప్రాంతాలను వ్యవసాయాధికారులు వెంటనే సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని రైతులు కోరుతున్నారు. నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

# అంగరంగ వైభవంగా సీత రామ కల్యాణం



**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలోని తలంబ్రాల కట్ట సమీపంలో ఉన్న కోట ఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం అశేష భక్తుల నడుమ జై శ్రీరామ్, జైశ్రీరామ్ అంటూ నినాదాల మధ్య "సీత రామ కల్యాణం "అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇల్లూరు విజయ లక్ష్మి, చితంబరయ్య కుటంబసభ్యులు భక్తి భవంతో కల్యాణం చేపట్టారు. మధుసూదన శర్మ కళ్యాణ తంతు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు బొల్లు వెంకటరామిరెడ్డి, శ్రీనివాస రెడ్డి, మారుతీ ప్రసాద్ ఇతరుల సమక్షంలో నిర్వహించారు. వందలాది మందికి అన్నదానం చేశారు భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గండి క్షేత్రంలో ఆలయ జీర్ణోదరణ, మహా కుంభాభిషేకంలో పాల్గొన్న ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి



**గండి - సూర్య వాస్తవం :** గండి క్షేత్రంలో జరుగుతున్న ఆలయ జీర్ణోదరణ, మహా కుంభాభిషేక కార్యక్రమంలో ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి పాల్గొనగా పూర్ణకుంభంతో వేద పండితులు స్వాగతం పలికారు. తదనంతరం ఆంజనేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు పాల్గొని, ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలియజేశారు. తదనంతరం ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో 26 కోట్ల రూపాయలతో గండి క్షేత్రాన్ని అభివృద్ధి చేయడం సంతోషంగా ఉంది అన్నారు.రెండేళ్ల క్రితమే నూతన ఆలయం పూర్తయినప్పటికీ పలు కారణాలతో ప్రారంభానికి నోచుకోలేదు. ప్రధాన ఆలయంతోపాటు రాజగోపురాలు అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. రేపటినుండి భక్తులకు ఆంజనేయస్వామి మూల విరాట్ దర్శనం భక్తులకు అందుబాటులో ఉంటుంది అన్నారు. 26 కోట్లు వెచ్చించి ఆలయ అభివృద్ధికి సహకరించిన వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఆంజనేయస్వామి భక్తుల తరపున ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని తెలియజేశారు.

## గండి క్షేత్రంలో ఆలయ జీర్ణోదారణ మహా కుంభాభిషేకంలో పాల్గొన్న ప్రముఖులు

**గండి - సూర్య వాస్తవం :** ప్రముఖ పుణ్యక్షేత్రం గండి ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది. సుమారు 28.5 కోట్ల రూపాయల భారీవ్యయంతో పునర్నిర్మించిన గండి వీరాంజనేయ స్వామి ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. మే 8వ తేదీన అంకురార్పణతో ప్రారంభమైన ఈ వేడుకలు, ఈ నెల 13వ తేదీ వరకు కొనసాగనున్నాయి. నేడు హనుమజ్జయంతి కావడంతో గండి క్షేత్రం భక్తజన సంద్రమైంది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ మూలమూర్తికి అర్చకులు సహస్ర కలశాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ అపురూప ఘట్టాన్ని కళ్లారా వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.ఈ మహా కుంభాభిషేక ఉత్సవాల్లో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న మంత్రి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి, టీడీపీ జిల్లా అధ్యక్షులు భూపేష్ రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య, బద్వేల్ టీడీపీ ఇన్‌ఛార్జ్ రితేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.



# పార్టీకి సేవలందించిన నాయకుల మృతి తీరని లోటు

## - నెలవల సుబ్రహ్మణ్యం- కార్యకర్తల కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుందని హామీ
## - మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పరామర్శలు..
## - కుటుంబాలకు ధైర్యంగా ఉండాలని సూచన





**పెళ్లకూరు- సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ నాయకుల కుటుంబాలను సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం మంగళవారం పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన పార్టీ నాయకుల భౌతికకాయాలకు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మొదటగా దిగువ చావాలి గ్రామానికి చెందిన గోను సుబ్బరామయ్య భౌతికకాయానికి నివాళులు అర్పించిన నెలవల సుబ్రహ్మణ్యం, అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీకి సేవలందించిన నాయకుల మరణం తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గోను శశిధర్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం పాలచూరు పంచాయతీ పరిధిలోని గుర్రపుతోట గ్రామానికి చేరుకున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకుడు మాడుపూరు మురళి నాయుడు తండ్రి నరసింహులు నాయుడు భౌతికకాయానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులను టీడీపీ ఎప్పటికీ మరవదన్నారు. కార్యకర్తల కుటుంబాలకు అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ఏఎంసీ డైరెక్టర్ గోను బాబు, స్వర్ణముఖి ఆనకట్ట ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, నాయకులు పేరం రమేష్ నాయుడు, మధు నాయుడు, మదన్మోహన్ నాయుడు, కృష్ణం నాయుడు, మాధవరెడ్డి, సిద్దులయ్య నాయుడు, పళనీ, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

## రిసెప్షన్ వేడుకలకు హాజరైనచంద్రగిరి రాధ యాదవ్



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పామిడి పట్టణంలో పామిడి వీర ఇంటి సమీపాన జరిగిన రిసెప్షన్ వేడుకలో హాజరై లిఖిత, చైతన్య మిత్రలకు వివాహ రిసెప్షన్ శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించిన వైయస్ జగన్ ఈ వేడుకకు గౌరవ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ వెంట హాజరైన చంద్రగిరి రాధయాదవ్ అనంతపురం జిల్లా వైసీపీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు, గుత్తి మండలం వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గుంతకల్లు కేంద్రంగా రెండు కీలక రైల్వే సేవలు ప్రారంభం..

- అనంతపురం జిల్లా రైల్వే అభివృద్ధిలో మరో చారిత్రాత్మక ఘట్టం
- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ప్రారంభమైన గుంతకల్లు
- మార్కాపూర్ రోడ్ పాసింజర్ రైలు, తిరుమల ఎక్స్‌ప్రెస్ విస్తరణ సేవలు
- జిల్లా ప్రజల చిరకాల కోరిక నెరవేర్చిన కేంద్ర రైల్వే శాఖకు ఎంపీ అంబికా కృతజ్ఞతలు
- ఈ రైల్వే సేవల సాధనలో సహకరించిన నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి కూడా ప్రత్యేక కృతజ్ఞతలు





**గుంతకల్ - సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా ప్రజలకు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రెండు కీలక రైల్వే సేవలకు మంగళవారం గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో ఘనంగా శ్రీకారం చుట్టారు. అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీ నారాయణ నిరంతర కృషి ఫలితంగా మంజూరైన గుంతకల్లు -- మార్కాపూర్ రోడ్ నూతన రోజువారీ పాసింజర్ రైలు (నెం. 57407/57408), తిరుమల ఎక్స్‌ప్రెస్ (18521/18522) సేవల విస్తరణను ఎంపీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.... అనంతపురం జిల్లా ప్రజల ప్రయాణ సౌకర్యాల మెరుగుదల కోసం తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని తెలిపారు. గుంతకల్లు -- మార్కాపూర్ రోడ్ రైలు సేవ సాధారణ ప్రజలకు, ముఖ్యంగా నంద్యాల, మార్కాపూర్ ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అలాగే తిరుమల ఎక్స్‌ప్రెస్ గుంతకల్లు వరకు విస్తరణతో ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రయాణం మరింత సులభతరం అవుతుందని తెలిపారు. ఈ సేవల మంజూరుకు సహకరించిన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కి, కేంద్ర సహాయ మంత్రి సోమన్న కి మరియు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కి ఎంపీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రయాణికులందరూ ఈ నూతన రైలు సేవలను వినియోగించుకొని సౌకర్యవంతమైన ప్రయాణాన్ని పొందాలని ఎంపీ కోరారు.



ఈ కార్యక్రమంలో డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా, ఏడీఆర్‌ఎం శివ ప్రసాద్, సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీఓఎం ఎం.శ్రావణ్, సీనియర్ డీఎస్‌టీఈ చంద్రశేఖర్, లేబర్ అండ్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ వెంకట శివుడు, ఆరెకటిక చైర్మన్ హరికృష్ణ, జిల్లా హాస్పిటల్ కమిటీ సభ్యులు నరసింహులు, ముష్టు భాస్కర్, డీఆర్‌సీ మెంబర్ శివప్రసాద్, యాదవ డైరెక్టర్ మస్తాన్, హ్యూమన్ రైట్స్ నాయకులు అఖిల్ నాయుడు, శ్రీనాథ్ గౌడ్, పవన్, హరి, రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నర్సుల సేవలు అమూల్యం, వెలకట్టలేనివి

### - ప్రజల ప్రాణాలు కాపాడే దేవదూతలు, ప్రాణదాతలు, ఆరోగ్య మాతలు:డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** నర్సుల సేవలు అమూల్యం,వెలకట్టలేనివని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. మంగళవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని వేంపల్లిలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. వేంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో సేవ చేస్తున్న సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ నాగమణిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, అటువంటి ఆరోగ్యాన్ని ప్రజలకు అందించేవారు డాక్టర్లతో పాటు నర్సులని అన్నారు. వైద్యరంగంలో కీలకమైన నర్సు వృత్తికి గౌరవాన్ని,హుందాతనాన్ని తీసుకొచ్చిన స్వర్గీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజును అంతర్జాతీయ నర్సుల దినోత్సవం గా ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో 1965 నుంచి జరుపు కుంటున్నారని తులసిరెడ్డి వివరించారు. ఆరోగ్య రక్షణలో నర్సులు అందించే తోడ్పాటును గుర్తుకు చేసుకోవడం ఈరోజు ముఖ్య ఉద్దేశం అన్నారు. కోవిడ్ సమయంలో నర్సులు అందించిన సేవలు ప్రశంసనీయం. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజల ప్రాణాలను కాపాడే దేవదూతలు, ప్రాణదాతలు, ఆరోగ్య మాతలు నర్సులు అని తులసి రెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో తులసి రెడ్డి సతీమణి శ్రీమతి నర్రెడ్డి అలివేలమ్మ,కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం,పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బద్రీనాథ్, వేమా రాజా, వేమయ్య గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమంతుడు కార్యసాధకుడు, బుద్ధిశాలి

### - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** హనుమంతుడు కార్యసాధకుడు, బుద్ధిశాలి, జ్ఞాననిధి అని తులసి రెడ్డి కీర్తించారు. మంగళవారం వేంపల్లిలో కాంగ్రెస్ నాయకులు హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి మాట్లాడుతూ పరాశర సంహిత ప్రకారం వైశాఖ బహుళ దశమి నాడు హనుమంతుడు వానరవీరుడైన కేసరికి, వానరకాంత అంజనీ దేవి రూపంలో ఉన్న అప్సరస పుంజికస్థలకు వాయుదేవుని అనుగ్రహంతో, శివుని తేజస్సుతో జన్మించాడని అన్నారు. ఆంజనేయుడు మహాబలవంతుడు.మహా పండితుడు. గాలిలో పక్షి కంటే వేగంగా ప్రయాణించగలడు. పర్వతాలను కదిలించగలిగే శక్తి కలవాడు. సందర్భాన్ని బట్టి శరీరాన్ని పెద్దదిగా, చిన్నదిగా చేయగలవాడు. ధైర్యానికి ప్రతీక. శక్తి సామర్థ్యాలకు ప్రతిరూపం. పరాక్రమశాలి. శ్రీరామచంద్రుని నమ్మిన బంటు.ఒక్క మాటలో చెప్పాలంటే ఆంజనేయుడు లేకుంటే రామాయణమే లేదన్నారు తులసి రెడ్డి. ఆంజనేయుని గుణగణాలు ప్రతి ఒక్కరికి ఆదర్శం అనుసరణీయం మార్గదర్శకం స్ఫూర్తిదాయకం అన్నారు.

## నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి

# ప్రధాని మోడీ నైతిక బాధ్యత వహించాలి

- దేశమంతా పేపర్ లీకుల సామ్రాజ్యాన్ని మోడీ దగ్గరుండి నడిపిస్తున్నారు
- పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) వరుసగా విఫలమవ్వడం సిగ్గుచేటు
- గత 11 ఏళ్ల బీజేపీ పాలనలో 89 సార్లు పేపర్ లీకులు జరిగాయని, 48 సార్లు పునః పరీక్షలు నిర్వహించారని, ఇదేనా మీరు సాధించిన ఘనకార్యం
- ప్రశ్నాపత్రాలు లీకు అయ్యి అమ్ముడుపోవడం దేశ విద్యా వ్యవస్థకే మాయని మచ్చ
- రాత్రింబవళ్లు కష్టపడి చదివిన 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభుత్వం అగమ్యగోచరంలోకి నెట్టింది
- నంద్యాల జిల్లా డీసీసీ అధ్యక్షులు డాక్టర్ గార్లపాటి మద్దులేటి స్వామి



**డోన్ - సూర్య వాస్తవం :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ (నీట్ యు జి 2026) ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నైతిక బాధ్యత వహించాలని నంద్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ ) అధ్యక్షులు, న్యాయవాది డాక్టర్ గార్లపాటి మద్దులేటి స్వామి డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం మరియు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ( ఎన్ టి ఏ ) వరుసగా విఫలమవ్వడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా డాక్టర్ మద్దులేటి స్వామి మాట్లాడుతూ మొన్న గుజరాత్, నిన్న బీహార్, నేడు రాజస్థాన్.. ఇలా బీజేపీ పాలిత రాష్ట్రాలే పేపర్ లీకులకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. దేశమంతా పేపర్ లీకుల సామ్రాజ్యాన్ని మోడీ దగ్గరుండి విస్తరిస్తున్నారని ఆరోపించారు. ఎన్ టి ఏ అంటే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కాదు, అది 'ప్రశ్నపత్రాలను వేలం వేసే సంస్థ'గా మారిందని, దానికి వేలంపాట దారుడు నరేంద్ర మోడీ అని తీవ్రంగా విమర్శించారు. పరీక్షకు 48 గంటల ముందే 122 ప్రశ్నలు బయటకు వెళ్లాయంటే, కేంద్ర ప్రభుత్వ అసమర్థత ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. వేలం లెక్కన ప్రశ్నాపత్రాలు అమ్ముడుపోవడం దేశ విద్యా వ్యవస్థకే మాయని మచ్చ అని, రాత్రింబవళ్లు కష్టపడి చదివిన 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభుత్వం అగమ్య గోచరంలోకి నెట్టింది. పేపర్లు లీక్ చేసి, మళ్లీ రాసుకోండి అని చెప్పడం విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మానసిక వేదనకు గురి చేయడమేఅని,గత 11 ఏళ్ల బీజేపీ పాలనలో 89 సార్లు పేపర్ లీకులు జరిగాయని, 48 సార్లు పునః పరీక్షలు నిర్వహించారని, ఇదేనా మీరు సాధించిన ఘనకార్యం అని ఆయన ప్రశ్నించారు.ప్రవేశ పరీక్షల నిర్వహణపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటం ఆపాలని డాక్టర్ మద్దులేటి స్వామి హెచ్చరించారు. ఈ లీకేజీపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సమాజంలో మంచి గుర్తింపును తీసుకురావాలి..

### - ఐసిడిఎస్ సూపర్వైజర్ మమత

**కదిరి- సూర్య వాస్తవం:** విద్యార్థిని విద్యార్థులు సమాజంలో మంచి గుర్తింపును తెచ్చుకున్నప్పుడే వారికి ఉన్నత స్థానం ఉంటుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ మమత పేర్కొన్నారు మంగళవారం కదిరి మండలం కౌలేపల్లి అంగన్వాడి కేంద్రంలో కిషోర్ వికాసం అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మమత మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ఉన్నత చదువులను ఇష్టంగా చదివినప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు.బాగా చదువుకొని తల్లిదండ్రులకు గురువులకు సొసైటీలో మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు సమాజంలో మంచి గౌరవ మర్యాదలు తెచ్చుకున్నప్పుడే ఎవరైనా మనల్ని ఆదరించి దగ్గరకు తీస్తారని పేర్కొన్నారు. విద్యతో పాటు మంచి పౌష్టికాహారాన్ని తీసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని వివరించారు. సమాజంలో పెద్దల పట్ల గౌరవంగా మసులుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# మా ఆస్తిని ఇప్పించి న్యాయం చేయండి..

### - టీడీపీ నాయకుడు సుదర్శన్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్



**కదిరి -సూర్య వాస్తవం :** మా ఆస్తిని మాకు అధికారులు ఇప్పించి న్యాయం చేయాలని కదిరి మండలం నడింపల్లి చెందిన శివారెడ్డి, నరేందర్ రెడ్డి లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తం చేశారు.తలుపుల మండలం లక్కసముద్రం మాజీ సర్పంచ్ కొడుకు సుదర్శన్ రెడ్డి మా సంతకాలు లేకుండా మా అన్న ఈశ్వర్ రెడ్డి దగ్గర భూమిని కొనుగోలు చేశాడని పేర్కొన్నారు. తమ అన్నదమ్ముల భాగాలున్న భూమిలో తమకు రావాల్సిన వాటాలో తమకు ఇవ్వకుండా అన్యాయం చేశాడని వాపోయారు. తమకు జరిగిన అన్యాయంపై మంగళవారం కదిరి ఆర్ అండ్ బి బంగ్లాలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బాధితులు మాట్లాడారు. బందర్ల మల్ రెడ్డి నాగమ్మకు ఈశ్వర్ రెడ్డి, శివారెడ్డి, రవీందర్ రెడ్డి, కాంతమ్మ, లక్ష్మీదేవి సంతానము ఉన్నామన్నారు. కదిరి మండలం పట్నం గ్రామ పొలం 105-2ఏ, 105- 2, 105-3-1 లెటర్లలో మొత్తం మూడు ఎకరాల 46 సెంట్లు భూమి ఉందన్నారు. అయితే ఈ భూమి మాకు పూర్వీకుల నుంచి పిత్రార్జితంగా సంక్రమించి వచ్చిందన్నారు అయితే తమకు తెలియకుండా మా అన్న ఈశ్వర్ రెడ్డి ఆయన పేరు మీద వన్ బి చేయించుకొని మాజీ సర్పంచ్ కొడుకు సుదర్శన్ రెడ్డికి భూమిని తమకు తెలియకుండా అమ్మేశారని వాపోయారు. మీకు అమ్మిన భూమిలో తమకు కూడా భాగం ఉందని ఈశ్వర్ రెడ్డి వద్ద తమకు తెలియకుండా మీరు ఎలా కొనుగోలు చేస్తారని పలుమార్లు సుదర్శన్ రెడ్డిని అడిగినప్పటికీ స్పందన లేదని బాధితులు ఆరోపించారు. తమకు జరిగిన అన్యాయంపై ఇప్పటికే జిల్లా ఎస్పీ కలెక్టర్ ఆర్డీఓ తహసిల్దార్ పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని అయినప్పటికీ తమకు న్యాయం జరగలేదని బాధితులు వాపోయారు. గత కొన్ని సంవత్సరాలుగా తమ అనుభవంలో ఉన్న భూమిని తమకు తెలియకుండా తమ సంతకాలు లేకుండా సుదర్శన్ రెడ్డి ఎలా కొనుగోలు చేస్తాడని ప్రశ్నించారు తమ బాధను అర్థం చేసుకొని అధికారులు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఉర్దూ పరిరక్షణకు సీఎం చంద్రబాబు విశేష కృషి

-ఆవో ఉర్దూ సిఖో-రండి ఉర్దూ నేర్చుకుందాం
-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫారూఖ్ షిబ్లీ



**రాయచోటి-సూర్య వాస్తవం:** ఉర్దూ భాష పరిరక్షణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశేష కృషి చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ చైర్మన్ జనాబ్ మహమ్మద్ ఫారూఖ్ షిబ్లీ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఉర్దూ భాష అభివృద్ధిని లక్ష్యంగా ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కోచింగ్ క్యాంప్ 'ఆవో ఉర్దూ సిఖే' రండి ఉర్దూ నేర్చుకుందాం. కార్యక్రమాన్ని మంగళవారం రాయచోటి పట్టణంలోని 'ఉర్దూ ఘర్ 'ప్రభుత్వ షాది ఖానాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఫారుక్ షిబ్లీ మాట్లాడుతూ ఉర్దూ మతపరమైన భాష కాదు అన్నారు. ఈ భాష పరి రక్షణకు, ఉర్దూ భాష అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో అనేక కార్యక్రమాలుప్రారంభించారు. యువతలో భాషనైపుణ్యాలను పెంపొందిస్తూ భవిష్యత్తుకు కొత్త మార్గాన్ని ప్రభుత్వం తెర లేపిందన్నారు. ముస్లిం విద్యార్థులకు గ్రంథాలయాలు కంప్యూటర్ విద్యతో పాటు



ఈ విద్యా విధానాన్ని సైతం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఉర్దూ మతపరమైన భాష కాదు. ఉర్దూ నేర్చుకుంటే నేషనల్ లెవల్ కాదు, ఇంటర్నేషనల్ స్థాయిలో మంచి ఉద్యోగ అవకాశాలు, గుర్తింపు లభిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన పిల్లలకు 'ఆవో ఉర్దూ సిఖె' పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు టిడిపి నాయకుడు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ఈ వేదికపై ఉర్దూభాష అభివృద్ధి గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ వైస్ చైర్మన్ మహమ్మద్ పఠాన్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాజాపీర్, టిడిపి నాయకుడు గాజుల ఖాదర్ బాషా, బోనుమల ఖాదర్ వలీ, ఇందాదుల్లా ఖాస్మి, షాహుల్ హామద్ చిష్టీ, ఉదయగిరి మస్తాన్, లోకం అష్రఫ్, బి ఎం కే అమీర్, రషీద్, గ్రంథాలయ అధికారి కరిముల్లా, ఇమ్రాన్,ఖాదర్ భాష,ఫజల్, తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ అకాడమీ పుస్తకావిష్కరణలో మైనారిటీ నేతలు



**పులివెందుల - సూర్య వాస్తవం :** రాయచోటి లోని ఉర్దూ అకాడమీ నందు మంగళవారం నిర్వహించినటువంటి ఉర్దూ అకాడమీ పుస్తకావిష్కరణలో మైనారిటీ నేతలు పుస్తకావిష్కరణ నిర్వహించారు. మంగళవారం రాయచోటి లోని ఉర్దూ షాదిఖానా నందు నిర్వహించిన "ఆవో ఉర్దూ సీఖే సమ్మర్ క్యాంప్ " కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మెన్ ఫరూక్ శుబ్లీ, వైస్ ఛైర్మెన్ పఠాన్ ఖాదర్ ఖాన్,రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్. మహబూబ్ భాషా తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం రోడ్డు రవాణా శాఖ మంత్రి తమ్ముడు మండిపల్లి లక్ష్మి ప్రసాద్ రెడ్డితో కలిసి ఉర్దూ అకాడమీ పుస్తకాన్ని ఆవిష్కరణ చేసి సభ నందు మైనారిటీ యొక్క ఉద్దేశలను తెలుపుతూ మైనారిటీ మత పెద్దలు, ఉర్దూ అకాడమీ కమిటీ సభ్యులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదర సోదరీమణులు అలాగే ఉర్దూ అభ్యసించే విద్యార్థులు, మైనార్టీ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## యువత భవిష్యత్తుకై 'కిశోర్ వికాస్' అవగాహన


- కెరీర్ గైడెన్స్, ఆరోగ్య సంరక్షణ, బాల్య వివాహాల నివారణపై విద్యార్థులకు సూచనలు
- తాల్వాయపాడు, కాపులూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా నిర్వహణ



**నాయుడుపేట - సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా నాయుడుపేట మండలంలోని తాల్వాయపాడు, కాపులూరు అంగన్‌వాడీ కేంద్రాలలో కిశోర్ వికాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ శ్రీమతి ఉమా మహేశ్వరి, సూపర్వైజర్లు సాయి లక్ష్మి , హేమలత పాల్గొన్నారు.ఈ సందర్భంగా యౌవన దశలో ఉన్న బాలురు, బాలికలకు కిశోర్ వికాస్ కార్యక్రమం ద్వారా నిర్వహించే దినచర్యలు, వాటి అవసరం, ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా కెరీర్ గైడెన్స్, భవిష్యత్ కెరీర్ ఎంపికలు, పోషకాహార విలువలు, ఆరోగ్యకరమైన జీవనశైలి వంటి అంశాలపై వివరంగా చర్చించారు.అలాగే మొబైల్ ఫోన్లు, టీవీల వినియోగాన్ని తగ్గించుకోవాలని, యౌవన దశలో ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, విద్యార్థులు తమ భవిష్యత్ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, యౌవన బాలురు, బాలికలు , స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సొసైటీ బ్యాంకులో వ్యవసాయ ఋణం తీసుకున్న రైతులు సకాలంలో రెన్యూవల్ చేయండి

- పిఏసిఎస్ సిఈఓ బాబా ఫక్రుద్దీన్



**నంబులపూలకుంట- సూర్య వాస్తవం:** మండల పరిధిలోని 12 గ్రామాల రైతులు దాదాపు 4 సంవత్సరాలనుండి రెన్యూవల్ చేయడంలేదు. రైతులందరు స్పందించి జూన్ లోగా సకాలంలో బ్యాంకులో వ్యవసాయ రుణాలు పొందిన ప్రతి రైతు రెన్యూవల్ చేసుకోవాలని పిఏసిఎస్ సిఈఓ బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. ప్రతి సంవత్సరం రెన్యూవల్ చేసుకుంటే 7శాతం వడ్డీతోపాటు, పావలా వడ్డీ రైతు ఖాతాకి జమ చేయబడుతుందని సూచించారు. ప్రతి రైతు పట్టాదార్ పాస్ బుక్, 1బి, 3 ఫోటోలు,లోన్ కి సరిపడా వడ్డీతో సొసైటీ బ్యాంకు లో సంప్రదించాలని తెలిపారు.

## హనుమాన్ జయంతి సందర్భంగా హిందూ సోదరుల సమక్షంలో భారీ బైక్ ర్యాలీ



**పామిడి- సూర్య వాస్తవం:** పామిడిలో హనుమాన్ జయంతి శోభయాత్ర (ర్యాలీ)అత్యంత వైభవంగా నిర్వహించారు. హిందూ సంస్థల ఆధ్వర్యంలో తొలిసారి పెద్ద ఎత్తున భోగేశ్వర స్వామి ఆలయం నుండి బైక్ ర్యాలీ, మెయిన్ బజార్ డబడే స్ట్రీట్, బెస్త వీధి బీసీసీ రోడ్డు గుండా విద్యా మందిరం వరకు చేపట్టారు. "జైశ్రీరామ్ ""రామ లక్ష్మణ జానకి, జైభోలో హనుమాన్‌కి "నినాదాలతో 12అడుగుల హనుమాన్ విగ్రహం ర్యాలీ లో రమణీయంగా నిలిచింది. డి జె సౌండ్ సిస్టం లో శ్రీరామ్ నినాదాలు, బాణాసంచా శబ్దల మధ్య సాగింది. శోభ యాత్ర లో యువత కేరింతలు వేస్తు చిందులు వేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు శోభ యాత్ర ప్రారంభించారు. హిందూ సంస్థల నాయకులు జోజోడే కుమార్, రాజశేఖర్ గౌడ్, అంజి నాయక్, కుమార స్వామి, నల్లప రెడ్డి ఆధ్వర్యంలో సాగింది హిందూ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శోభాయాత్రలో ముస్లిం సోదరుల సేవలు

- తుగుట్ల మధు యువసేన ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు మజ్జిగ పంపిణీ



**పులివెందుల -సూర్య వాస్తవం:** పులివెందులలో హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరణనుచుకొని నిర్వహించిన శోభాయాత్రలో హిందువుల ఆధ్యాత్మిక ఆలోచనలకు సహకరిస్తూ తెదేపా నాయకుడు తూగుట్ల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు మజ్జిగ పంపిణీతో భక్తి భావ సేవలు అందించారు. వివరాల్లోకి వెళితే పులివెందులలో హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకొని హనుమాన్ శోభాయాత్ర వైభవంగా సాగగా పట్టణ పరిధిలో హిందూ సోదరులు అధిక సంఖ్యలో తరలిరాగా శోభాయాత్ర మొత్తం కాషాయమయం కాగా జై శ్రీరామ్ జై హనుమాన్ నినాదాలతో భక్తులు హోరెత్తించారు అయితే మతసామరస్యం వెల్లువిరిసేలా తెదేపా నాయకుడు తగుట్ల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో మైనార్టీ సోదరులు శోభాయాత్రకు తరలివచ్చిన ప్రజలకు మజ్జిగ, మంచినీరు మరియు పానకం వంటి వాటిని పంపిణీ చేసి కులం మతం తేడా లేదు, జాతి వర్ణ విభేదాలకు మా పట్టణంలో తావు లేదు, మతసామరస్యానికి మేమే ఆదర్శం అంటూ దేవుడు ఎవరైనా అందరికీ మంచి జరగాలని ఆకాంక్షను ప్రతిబింబిస్తూ వారు అందించినటువంటి సేవలను పలువురు ప్రశంసించారు.

## జాతీయ రహదారికి ఇల్లు స్థలాలు కోల్పోయిన వారికి పరిహారమందేటట్టు చూస్తాం

- రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు

**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం :**వేంపల్లి రాయచోటి జాతీయ రహదారికి ఇల్లు స్థలాలు కోల్పోయిన వారికి పరిహారం అందేటట్లు చూస్తామని రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లి లో సుమారు 20 కుటుంబాలకు సరైన పరిహారం అందలేదని వారు తాసిల్దార్ కు కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన న్యాయం జరగలేదని అన్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ఆరేళ్ల క్రితం ఇంటికి రోడ్డుకు 15 మీటర్లు అని చెప్పి పాయింట్ పెట్టారని అయితే ప్రభుత్వం పాయింట్ పెట్టిన కంటే ఎక్కువ స్థలాన్ని పడగొడుతున్నారని బాధితులు వాపోయారు. అంతేకాకుండా ప్రభుత్వ నుంచి సరైన పరిహారం అందడం లేదని డ్రైనేజ్ కాలువకు ఇంటికి గతంలో ఐదు మీటర్లు చెప్పి ప్రస్తుతం ఏడు మీటర్లు పడగొడుతున్నారని ఉన్న ఇల్లు కోల్పోతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.అంతేకాకుండా కొంతమందికి ఇంకా ఇప్పటివరకు పరిహారం అందడం లేదని కార్యాలయాల చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం పూర్తి స్థాయిలో ఇచ్చేంతవరకు తమ ఇళ్ళను పడకొట్టమని దీర్గించుకోస్తున్నారు. ప్రభుత్వం నిబంధన ప్రకారం పరిహారం అందుతుందని రోడ్డుకు ఎంత స్థలం కోల్పోతున్నారు అంత స్థలానికి ప్రభుత్వం పరిహారం ఇస్తుందన్నారు ఇంకా కొన్ని ఇల్లు కోర్టులో ఉన్నాయని కొన్ని ఇళ్లకు సర్వే నెంబర్లు సక్రమంగా లేవని అటువంటి వాటికి పరిహారం రావడం లేదని ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి తొందరలో బాధితులకు పరిహారం అందేటట్టు చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ క్రాంతికుమార్ నేషనల్ హైవే డిఈ చంద్రశేఖర్ రెడ్డి డిఐఓఎస్ గురువు రెడ్డి ఏ ఈ హరిబాబు మండల్ సర్వే సుస్మిత వీఆర్వోలు విఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.



## కనేకల్ ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ హాస్పిటల్లో సేవలు భేష్ !

- రోజురోజుకు పెరుగుతున్న ఓపీలు
- సిబ్బంది కొరతను తప్పకుండా తీరుస్తాం : హెల్త్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ సుజాత





**కనేకల్ -సూర్య వాస్తవం:** కనేకల్ ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ హాస్పిటల్లో అందుతున్న వైద్య సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని హెల్త్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ సుజాత పేర్కొన్నారు. మంగళవారం ఆమె సెల్వన్ రాజ్‌తో కలిసి ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవలు, ఔషధాల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. వార్డులు, ప్రసూతి విభాగం, ల్యాబ్, ఔషధ నిల్వ గదులను తనిఖీ చేసి రోగులతో మాట్లాడి వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.ఆసుపత్రిలో గతంతో పోలిస్తే ఓపీల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకం పెంచుకుంటున్నారని ఆమె తెలిపారు. రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు.ఆసుపత్రిలో ఉన్న సిబ్బంది కొరతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా పరిష్కరిస్తామని డాక్టర్ సుజాత హామీ ఇచ్చారు. పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు.ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయాలని ఆమె పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీఫ్, డాక్టర్ భారతి, డాక్టర్ రాజు, డాక్టర్ మహేంద్ర , నర్సింగ్ ఆఫీసర్స్ ధనలక్ష్మి, పార్వతి, ల్యాబ్ టెక్నీషియన్ వంశీ, రేడియాలజిస్ట్ జయచంద్ర మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామి జయంతి ప్రత్యేక పూజలు

- భక్తులకు అల్పాహారం, అన్నదాన కార్యక్రమం నిర్వహణ

**పులివెందుల -సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న చందమామ డాబా వెనుక వైపున హనుమాన్ నగర్‌లో వెలిసిన శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయ స్వామి జయంతి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వేదమం త్రోచ్చారణల మధ్య అభిషేకాలు, అర్చనలు నిర్వహించి స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు.అనంతరం ఆలయ నిర్వాహకులు అక్కడికి విచ్చేసిన భక్తులకు అల్పాహారాలు అందజేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.స్థానిక ప్రజలు,యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొ న్నారు.





# ‘వారణాసి కొత్త షెడ్యూల్ మొదలు



రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు నటిస్తున్న ‘వారణాసి కొత్త షెడ్యూల్ మంగళవారం ప్రారంభమైంది. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా రూపొందించిన భారీ సెట్లలో మహేష్ బాబు, ప్రియాంక చోప్రా సహా ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను తెరకెక్కించేందుకు చిత్ర బృందం సిద్ధమైంది. ఈ షెడ్యూల్ పూర్తయ్యాక సినిమా యూనిట్ విదేశీ లొకేషన్లకు వెళ్లనుంది. కెన్యా, యూరప్‌తో పాటు మరికొన్ని అరుదైన ప్రదేశాల్లో చిత్రీకరణ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాలని రాజమౌళి ప్లాన్ చేస్తున్నారు. ఇటీవల మెక్సికోలో జరిగిన ఓ ఇంటర్నేషనల్ ఈవెంట్‌లో ‘వారణాసి?ఐని పరిచయం చేసిన చిత్రబృందం.. త్వరలో ఫ్రాన్స్‌లో కూడా భారీ ప్రమోషన్స్ నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో మహేష్ బాబు ‘రుద్ర అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ప్రియాంక చోప్రా ‘మందాకిని?ఐ పాత్రలో నటిస్తుండగా.. మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ‘కుంభ అనే ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా 2027 ఏప్రిల్ 7న విడుదల కానుంది. టైమ్ ట్రావెల్ ఎలిమెంట్స్‌తో సాగే ఈ కథ వారణాసి నుంచి మొదలై కెన్యా, అంటార్కిటికా వరకు విస్తరించనుందట. ముఖ్యంగా రామాయణ యుద్ధం నేపథ్యంతో రూపొందిస్తున్న 25 నిమిషాల భారీ యాక్షన్ ఎపిసోడ్ ఈ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని సినీ వర్గాలు చెబుతున్నాయి.

# శూర్పణఖగా రకుల్



రెండు భాగాలుగా తెరకెక్కుతున్న రామాయణ చిత్రంలో శూర్పణఖ పాత్రను రకుల్ ప్రీత్ సింగ్ పోషిస్తున్నారు. ప్రస్తుతం ఆమె పాత్రకు సంబంధించిన చిత్రీకరణ జరుగుతోంది. నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, యశ్ రావణాసురుడిగా నటిస్తున్నారు. ఈ సినిమా మొదటి భాగం ఈ ఏడాది దీపావళికి విడుదల కానుంది. శూర్పణఖ పాత్ర కోసం కొంతకాలం క్రితం పలువురితో టెస్ట్ షూట్ చేసిన నితీశ్ తివారీ చివరకు రకుల్ ప్రీత్ సింగ్‌ను ఎంపిక చేశారని తెలుస్తోంది. ప్రస్తుతం హిందీలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సన్నీ డియోల్ హనుమాన్‌గా, లారా దత్తా కైకేయిగా, ఇందిరా కృష్ణన్ కౌసల్యగా, కాజల్ అగర్వాల్ మండోదరిగా నటిస్తున్నారు.

# మందారం పాత్రలో ...



హీరో శర్వానంద్, దర్శకుడు సంపత్ నంది కాంబోలో రూపొందుతున్న పాన్-ఇండియా పీరియడ్ యాక్షన్ సినిమా ‘భోగి శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ నిర్మాణంలో లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. తాజాగా మేకర్స్ డింపుల్ హయాతి పాత్ర లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో ‘మందార్ంఐ అనే పాత్రలో ఆమె కనిపించనున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ఆమె ఎర్ర చీరలో చేతిలో విసనకర్ర పట్టుకుని కనిపిస్తున్న ఆమె లుక్ 1960ల కాలాన్ని ప్రతిబింబించేలా ఉంది. ఆమె చూపుల్లోనే ఒక తిరుగుబాటు స్వభావం కనిపిస్తోంది. ఈ పోస్టర్‌కి ‘ప్రపంచం కోరుకున్న సౌందర్యం.. ప్రపంచం ఎన్నడూ అర్థం చేసుకోని ఆత్మ, మందారంను పరిచయం చేస్తున్నం అంటూ మేకర్స్ క్యాప్షన్ ఇచ్చారు. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఆగస్టు 28న రాఖీ పౌర్ణమి సందర్భంగా విడుదల కానుంది.

# నేడు ‘శ్రీనివాస మంగాపురం

### - పాట విడుదల




సీనియర్ కథానాయకుడు ఘట్టమనేని కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ హీరోగా టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఆయన నటిస్తున్న తొలి చిత్రం ‘శ్రీనివాస మంగాపుర్ంఐ. ఈ సినిమాలో జయకృష్ణ సరసన హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా టాండన్ నటిస్తోంది. ఈమెకు కూడా ఇది టాలీవుడ్‌లో మొదటి సినిమా. ప్రమోషన్లలో భాగంగా ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తాజాగా చిత్రబృందం సెకండ్ సింగిల్ అప్‌డేట్‌ను ఇచ్చింది. ‘మంగా మంగ్న?ఐ అంటూ సాగే ఈ పాటను మే 13న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో జయకృష్ణ తన ‘మంగ్ణ రాషాను చూస్తూ ఉండిపోయిన దృశ్యం ఉంది. దర్శకుడు అజయ్ భూపతి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రాయలసీమ నేపథ్యంలో పక్కా యాక్షన్ ఓరియెంటెడ్ కథాంశంతో ఈ సినిమా రూపొందుతోంది. కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ఇందులో ఒక కీలక పాత్రలో కనిపించబోతున్నారు.



## మోదీ స్టేడియంలో సన్‌రైజర్స్ ఘోరపరాజయం...

# 86 పరుగులకే ఆలౌట్

**- సన్‌రైజర్స్‌పై 82 పరుగుల తేడాతో గుజరాత్ ఘన విజయం**
**- 169 పరుగుల లక్ష్య ఛేదనలో స్వల్ప స్కోరుకే కుప్పకూలిన హైదరాబాద్**
**- రాణించిన గుజరాత్ బౌలర్లు.. రబడా, హోల్డర్‌లకు మూడేసి వికెట్లు**



అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను 82 పరుగుల భారీ తేడాతో చిత్తుగా ఓడించింది. 169 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్.. గుజరాత్ బౌలర్ల ధాటికి 14.5 ఓవర్లలో కేవలం 86 పరుగులకే కుప్పకూలింది.

ఛేదనలో సన్‌రైజర్స్ ఆది నుంచే వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ డకౌట్‌గా వెనుదిరగడంతో మొదలైన పతనం ఏ దశలోనూ ఆగలేదు. కగిసో రబడా (3/28), జాసన్ హోల్డర్ (3/20) నిప్పులు చెరిగే బంతులతో హైదరాబాద్ బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చారు. ప్రసిద్ధ్ కృష్ణ రెండు వికెట్లు తీయగా, సిరాజ్ ఒక వికెట్ పడగొట్టాడు. హైదరాబాద్ జట్టులో కెప్టెన్ పాట్ కమిన్స్ (19) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

అంతకుముందు, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (44 బంతుల్లో 61), వాషింగ్టన్ సుందర్ (33 బంతుల్లో 50) అద్భుతమైన హాఫ్ సెంచరీలతో జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించారు. ఆరంభంలో కెప్టెన్ గిల్ సహా కీలక వికెట్లు త్వరగా కోల్పోయినా, వీరిద్దరి భాగస్వామ్యాలు గుజరాత్‌ను ఆదుకున్నాయి. హైదరాబాద్ బౌలర్లలో ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ రెండేసి వికెట్లు తీశారు.మొత్తంగా బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన గుజరాత్ ఈ సీజన్‌లో మరో కీలక విజయాన్ని నమోదు చేసుకుంది.

## రెజ్లర్ వినేష్ పోగట్‌కి మద్దతు తెలిపిన సాక్షిమాలిక్



న్యూఢిల్లీ : రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యు ఎఫ్ ఐ) పై రెజ్లర్ వినేష్ ఫోగట్ చేస్తున్న పోరాటానికి ఒలింపిక్ కాంస్య పతక విజేత రెజ్లర్ సాక్షి మాలిక్ మద్దతు ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా దేశాలు క్రీడల్లో కొత్త తల్లులు తమ కెరీర్ లను తిరిగి ప్రారంభించడానికి సహాయపడేందుకు నిబంధనలను సడలిస్తుంటే.. ఇక్కడ వినేష్ ఫోగట్ ను అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. వినేష్ ఫోగట్ కు మద్దతుగా మంగళవారం సోషల్ మీడియా పేజీలోని ఒక వీడియో క్లిప్ లో ఆమె మాట్లాడారు. ఈ అంశంపై తన అభిప్రాయం అడిగారని, వినేష్ ఒక రాజకీయ పార్టీకి చెందిన ఎమ్మెల్యే కావడంతో గత రెండు మూడు రోజులుగా ఆలోచిస్తున్నానని అన్నారు. తనకు ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదని అన్నారు. మహిళలు తల్లులైన తర్వాత కూడా దేశం కోసం ఆడి, పతకాలు గెలవగలిగేలా, ప్రపంచవ్యాప్తంగా దేశాలు తమ క్రీడాకారుల కోసం నిబంధనలను సడలించిన ఎన్నో ఉదాహరణలు ఉన్నాయని అన్నారు. కానీ రిటైర్మెంట్ తర్వాత తిరిగి పోటీలో పాల్గొనకుండా వినేష్ ఫోగట్ ను రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) అడ్డుకుంటోందని మండిపడ్డారు. వినేష్ కూడా దేశం కోసం పతకాలు గెలిచి, తల్లి అయిన తర్వాత కూడా పతకాలు సాధించడం ద్వారా మహిళలకు ఆదర్శంగా నిలిచేలా ఆమెకు ట్రయల్స్ నిర్వహించాలని తాను ప్రధాని మోడీ, క్రీడల మంత్రి, డబ్ల్యుఎఫ్ ఐని అభ్యర్థిసున్నానని వీడియోలో పేర్కొన్నారు.

## స్లో ఓవర్ రేట్.. అక్షర్‌కు రూ. 12 లక్షల ఫైన్



ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ విజయం సాధించినప్పటికీ, ఆ జట్టు కెప్టెన్ అక్షర్ పటేల్‌కు జరిమానా తప్పలేదు. ఈ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ నమోదు చేసిన కారణంగా అక్షర్‌కు రూ. 12 లక్షల ఫైన్ విధిస్తున్నట్లు ఐపీఎల్ యాజమాన్యం ప్రకటించింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఢిల్లీ జట్టుకు స్లో ఓవర్ రేట్ కారణంగా ఇది తొలి తప్పిదం. దీంతో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి ప్రకారం కెప్టెన్ అక్షర్ పటేల్‌కు రూ. 12 లక్షల జరిమానా విధించినట్లు ఐపీఎల్ ఒక ప్రకటనలో పేర్కొంది.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**పులివెందుల – సూర్య వాస్తవం :** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పులివెందుల టు కదిరి మార్గాన కంకర మిల్లు వద్ద కొలువై ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఆలయ నిర్వాహకులు షరీఫ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఉదయా స్తమాన ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారికి ఉత్సవమూర్తికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన ఆకు పూజ తదితర కైకర్యాల పూజ కార్యక్రమాల అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. వాటిలో భాగంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు షరీఫ్ మాట్లాడుతూ ఆంజనేయ స్వామివారి అనుగ్రహంతో భక్తుల సహాయ సహకారాలతో ప్రతి సంవత్సరం హనుమాన్ జయంతి ఆలయ వార్షికోత్సవం అత్యంత ఘనంగా విశేష పూజలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు.




**ఆలయ అభివృద్ధికి సహకరించండి**

అభయ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి భక్తులు వస్తురూపమైన ధన రూపేనా సహాయ సహకారాలు అందించిన వారికి ఆలయ ప్రాంగణంలో శిలాఫతకాలు అంతేకాకుండా స్వామివారి కార్యక్రమాలకు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని, ఆలయ గాలిగోపురం ధ్వజస్తంభం తదితర ఆలయ అభివృద్ధి పనులకు భక్తులు సహకరించాలని ఆలయ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన అన్నదాన ప్రసాదాలు భక్తులకు అందజతెలిపారు. సహకరించు దాతలు ఆలయం వద్ద నిర్వాహకులు సంప్రదించాలని తెలిపారు.

**పులివెందుల మండలం వెంకటాపురం గ్రామంలో...** హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని, తెలుగు దేశం పార్టీ యువ నాయకులు పోతుల జ్ఞానేశ్వర్ నాయుడు సాదర ఆహ్వానం మేరకు, ముఖ్య అతిథిగా భూమిరెడ్డి ఉమాదేవి గ్రామానికి విచ్చేసి అంజనీపుత్రుడిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామివారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి, భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భూమిరెడ్డి ఉమాదేవి మాట్లాడుతూ బలం, బుద్ధి, విద్యను ప్రసాదించే ఆ హనుమంతుని కృపా కటాక్షాలు వెంకటాపురం గ్రామ ప్రజలందరిపై ఉండాలని మనసారా కోరు కుంటున్నాను. రామభక్తుడైన హనుమంతుని ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురా రోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.





**మడకశిర నియోజకవర్గం...** అగళి మండలం బొమ్మరసనపల్లి గేట్ వద్ద హను మాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో విగ్రహ ప్రతిష్టాపన విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి చిక్కప్పయ్య, కుటుంబ సభ్యులు, బంధువులు మరియు వివిధ ట్రస్టుల సహకారంతో ఈ నూతన దేవాలయాన్ని నిర్మించారు. బృహత్ పంచముఖ ఆంజనేయ స్వామి ఏకశిలా మూర్తిని వేద పండితుల మంత్రోచ్చారణలు, శాస్త్రోక్తమైన పూజా కార్యక్రమాల మధ్య విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం దిగ్విజయంగా జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తి భావాన్ని పెంపొందించేలా కళాకారులు రామాయణ నాటకాన్ని ప్రదర్శించారు. రామాయణంలోని ఘట్టాలను కళ్ళకు కట్టినట్లు ప్రదర్శించి భక్తులను అలరించారు.

**భక్తుల కోలాహలం**

ఈ కార్యక్రమానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను, అన్నదానాన్ని భక్తులు స్వీకరించారు. ఈ విగ్రహ ప్రతిష్టాపనతో బొమ్మరసనపల్లి ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. అగళి మండలంలో ఈ పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహం ఒక ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవనుంది.

**తాడిపత్రి జె.సి.అష్మిత్ రెడ్డి ఆలయాల్లో ...**

హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని తాడిపత్రి శాసనసభ్యులు జెసి అష్మిత్ రెడ్డి నియోజకవర్గంలో బిజీబిజీగా గడిపారు. ఆలయ సందర్శనలు ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే రెండు ప్రముఖ క్షేత్రాలను సందర్శించారు: పెద్ద పప్పూరు మండలం ఎమ్మెల్యే స్వగ్రామం అయిన జూటూరు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత పెద్దవడుగూరు మండలం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కోటకొండ ఆంజనేయ స్వామిని దర్శించుకుని, స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ రెండు ఆలయాల్లోనూ అర్చకులు ఎమ్మెల్యేకి తీర్థప్రసాదాలు అందజేసి, వేద మంత్రాలతో ఆశీర్వదించారు.ఆధ్యాత్మిక కార్యక్రమాల అనంతరం, తన



అనుచరుల పట్ల ఉన్న ఆత్మీయతను చాటుకున్నారు.యాడికి మండలం వెంగన్న పల్లి జెసి ముఖ్య అనుచరుడు నాగముని రెడ్డి మనవడి కేశఖండన (పుట్టువెంట్రుకలు) కార్యక్రమానికి అష్మిత్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆ చిన్నారిని ఆశీర్వదించి, కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించారు.జెసి అష్మిత్ రెడ్డి ఈ పర్యటనతో అటు భక్తుల్లోనూ, ఇటు పార్టీ శ్రేణుల్లోనూ కొత్త ఉత్సాహం నెలకొంది.




**పామిడి స్థానిక మండల పరిధిలో...** ఉన్నటువంటి పలు హనుమాన్ ఆలయాలలో కోట ఆంజనేయ స్వామి ఆలయం, అనగా దత్తాత్రే ఆలయం,పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం, కాలాపురం చిన్న నెట్టికంటి ఆలయలలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి అ ఆలయాల అర్చకులు స్వామికి పంచామృత అభిషేకం, ఆకుపూజ, నూతన వస్త్రాలంకరణ చేశారు. మన్యుసూక్త పారాయణం, కలశస్థాపన పూజల అనంతరం మహామంగళ హారతి నిర్వహించారు. వ్యాసరాజ ప్రతిష్ఠితమైన ఈ ఆలయంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పలు ఆలయాలకు పోటెత్తారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.





**సింహాద్రిపురంలోని.....** ఏడు బిళ్ళల బావి సమీపంలో వెలసిన ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం హనుమజ్జయంతి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తిని మినీ ట్రాక్టరుపై అందంగా అలంకరించి,గ్రామ వీధుల్లో వైభవంగా ఊరేగించారు.ఈ గ్రామోత్సవంలో ఎల్లనూరు చిన్నారులు చేసిన కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.చిన్నారుల లయ బద్ధమైన కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో సింహాద్రిపురం చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు భారీగా ప్రసాద వినియోగం జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.



**పులివెందులలో నూతన ఆర్టీసీ బస్టాండ్ వద్ద ...** మంగళవారం హనుమాన్ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర ఆద్యంతం ఆధ్యాత్మికంగా కొనసాగగా, ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక కార్యక్రమాలు నిలిచి భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పులివెందులలో నూతన ఆర్టీసీ బస్టాండ్ వద్ద హనుమాన్ ఆలయం పునర్నిర్మాణం మరియు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అదేవిధంగా హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హనుమాన్ శోభాయాత్ర వేడుకలు కనుల పండుగ జరిగాయి. నగర వీధులన్నీ జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో మారుమోగగా, భక్తుల కోలాహలం, కాషాయ జండాల రెపరెపల మధ్య హనుమాన్ శోభాయాత్ర అత్యంత వైభవంగా కొనసాగాయి. మంగళవారం సాయంకాలం నూతన ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల హనుమాన్ ఆలయం వద్ద నుండి గాంధీ సర్కిల్, పూలంగళ్లు, వెంకటేశ్వర స్వామి దేవస్థానం, పాత ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రధాన రహదారుల గుండా శోభాయాత్ర కొనసాగగా నియోజకవర్గ నలుమూలల నుండి చిన్నచిన్న ర్యాలీలతో భక్తులు ఊరేగింపులో భాగమయ్యారు. దారి పొడవునా భక్తులు చేసిన కోలాటాలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలువగా, దాతలు మరియు ముస్లిం సోదరులు మార్గమధ్యంలో పానకం, మజ్జిగ మరియు తినుబండారాలను అందజేసి విశేష సేవలు అందించగా, హనుమంతుని భారీ విగ్రహం భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమాలను పురస్కరించుకుని పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు మరియు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలను చేపట్టారు. మొత్తం మీద పులివెందులలో మంగళవారం భక్తి, మతసామరస్యం క్రమశిక్షణతో కూడిన శోభాయాత్ర పట్టణం నలుమూలలో ఆధ్యాత్మిక శోభను ప్రతిబింబించింది.

**కనేకల్‌లో....** శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, తమలపాకుల అలంకార పూజలు నిర్వహించి ప్రత్యేక దర్శనాలు కల్పించారు. సాయంకాలం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా, హనుమాన్ దండకం సామూహిక పారాయణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భజనలు, పారాయణాలతో ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపారు.అనంతరం భక్తాదులకు పానకం, ప్రసాదం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కనేకల్ శాఖ అధ్యక్షులు డోన్ రవిచంద్ర, కార్యదర్శి నాగరాజు, సహ కార్యదర్శి రాచర్ల రమేష్, మాతృశక్తి సంయోజక్ జి. భారతి బృందం, బజరంగ్ దళ్ సంయోజక్ కరణం వరుణ్, వై.టి. రాజశేఖర్ రెడ్డి, దిబ్బల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.





**శింగనమలలో ...** శింగనమల మండలం మరవకొమ్మ క్రాసులో వెలసిన శ్రీ మరవ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.భక్తాదులు భక్తి,శ్రద్ధలతో ఎంతో ఉత్సాహంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ ఆంజనేయ స్వామి జన్మదినం హనుమాన్ జయంతి వేడుకగా భక్తాదులు జరుపుకుంటారు. అతి పురాతనమైన శ్రీ మరవ ఆంజనేయ స్వామి దేవాల యంలో భక్తాదులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణతో పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో శింగనమల తహశీల్దార్ శేషారెడ్డి,ఏంపీడీఓ భాస్కర్ ,సీహెచ్ సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహినాథ్ ,డాక్టర్ శివకుమార్ ,ఆర్ఐలు విష్ణు, భాను మరియు వివిధశాఖల అధికారులు,సిబ్బంది,స్వామి వారి భక్తాదులు, మండల ప్రజలు పాల్గొన్నారు.శ్రీ ఆంజనేయుడు మనకు ధైర్యం, నమ్మకం, భక్తి ఎంత ముఖ్యమో నేర్పుతాడని భక్తుల నమ్మకం. ఆయన ఆశీస్సులతో జీవితం విజయవంతంగా సాగాలని భక్తాదులు కోరుకుంటారు. పూజలలో పాల్గొన్న భక్తాదులకు తీర్థ,ప్రసాదాలు అందించడంతో పాటు దాతలు,భక్తాదుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.శివపురం గ్రామ యువత ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు.



**ఉరవకొండ లో ...** ఉరవకొండతో పాటు తెలుగు రాష్ట్రాల్లో వైశాఖ బహుళ దశమి సందర్భంగా నిర్వహించే హనుమాన్ జయంతి' వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి.చైత్ర పర్ణమి రోజున 41 రోజుల హనుమాన్ దీక్షను ప్రారంభించిన భక్తులు, ఈ రోజున స్వామివారిని దర్శించుకుని తమ మాలలను విసర్జించి దీక్షను విరమిస్తారు. ఉరవకొండలోని ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారికి ఆకుపూజలు, సింధూర అలంకరణలు మరియు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.హనుమాన్ చాలీసా, సుందరకాండ పారాయణం, 'జై శ్రీరామ్' నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మారుమోగుతున్నాయి.భక్తులకు వడపప్పు, పానకం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం రోజునే హనుమాన్ జయంతి రావడం వల్ల ఈసారి వేడుకలకు మరింత ప్రాముఖ్యత చేకూరింది. స్థానికంగా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులయ్యారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )